
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
శుక్రవారం 19 జూలై 2024


గుండ్లపాడులో టీడీపీ నేత చంద్రయ్యను నడిరోడ్డులో గొంతుకోసి హత్య చేస్తున్న వైసీపీ మూకలు, ఇన్‌సెట్‌లో చంద్రయ్య (ఫైల్‌ఫొటో)


రెంటాలలో దగ్ధమవుతున్న బ్రహ్మానందరెడ్డి వాహనం (ఫైల్)


కారంపూడిలో టీడీపీ కార్యాలయాన్ని ధ్వంసం చేసిన వైసీపీ మూకలు (ఫైల్)


కారంపూడిలో టీడీపీ నేత కారుకు నిప్పుపెట్టిన దృశ్యం (ఫైల్‌ఫొటో)


మాచర్ల పట్టణంలో టీడీపీ కార్యాలయం వద్ద కారుకు నిప్పు పెట్టిన దృశ్యం (ఫైల్)


మాచర్ల టీడీపీ కార్యాలయానికి నిప్పుపెట్టిన దృశ్యం (ఫైల్)



జగనన్నా!... వీరికేదీ పరామర్శ..?

కొన్ని ఘటనలు ఇలా..

- వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు చంద్రయ్యను అదే గ్రామానికి చెందిన వైసీపీ నేతలు పట్టపగలు అందరూ చూస్తుండగానే అత్యంత పాశవికంగా గుండెలమీద మోకాళ్లతో తొక్కిపెట్టి జై జగన్ అని అనలేదని గ్రామం నడిబొడ్డున గొంతుకోసి హత్యచేశారు. దుర్గి మండలం జంగమహేశ్వరపాడులో తెలుగుదేశం పార్టీ నాయకుడు జల్లయ్యను వైసీపీ నాయకులు పట్టపగలు గ్రామం ప్రధాన రహదారిపై దాడిచేసి హత్యచేశారు. ఈ గ్రామంలో తెలుగుదేశం సానుభూతిపరులైన 50 కుటుంబాలు గ్రామం విడిచిపెట్టి బంధువుల ఇళ్లలో తలదాచుకున్నాయి. వీరి పొలాలను బీడులుగా మార్చారు. గురజాల మండలం అంబాపురంలో ఎస్సీ సామాజికవర్గానికి చెందిన తెలుగుదేశం కార్యకర్త విక్రంను అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు హత్యచేశారు. గురజాల పోలీసు స్టేషన్ నుంచి ఇంటికి వెళుతుండగా గ్రామంలోనే దాడిచేసి మట్టుబెట్టారు. దాచేపల్లి మండలం పెదగార్లపాడుకు చెందిన మాజీ సర్పంచి, టీడీపీ నేత పురంశెట్టి అంకుల్ దాచేపల్లిలో హత్యకు గురయ్యారు. అదే గ్రామానికి చెందిన వైసీపీ నేత ఒకరు హత్యలో కీలకపాత్ర పోషించారు. దాచేపల్లిలో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనం వద్దకు రావాలని పిలిచి గొంతుకోసి హత్యచేశారు.
- నరసరావుపేటలో మసీదు స్థలం వివాదంలో టీడీపీకి చెందిన ఇబ్రహీంను జనసంచారంలోనే వైసీపీ వారు కత్తులతో దాడి చేసి హతమార్చారు. పిడుగురాళ్ల పట్టణ శివారులో తుమ్మలచెరువుకు చెందిన తెలుగుదేశం కార్యకర్త షేక్ సైదాను వైసీపీ కార్యకర్తలు కర్రలతో కొట్టి గాయపరిచారు.
- మాచవరం మండలం పిన్నెల్లి గ్రామంలో తెలుగుదేశం వారిపై వైసీపీ అల్లరిమూకలు దాడులకు తెగబడ్డాయి. అప్పట్లో గ్రామాలు వదిలివెళ్లిన 50 కుటుంబాలవారు బంధువుల ఇళ్లల్లో తలదాచుకున్నారు. ఎన్నికల మందే ఈ కుటుంబాలు పిన్నెల్లికి తిరిగి వచ్చాయి. తురక పాలెంలో టీడీపీ కార్యకర్త ఇంటికి నిప్పు పెట్టి తగలబెట్టారు. ఆ సమయంలో ఇంట్లో నిద్రిస్తున్న నలుగురు ప్రాణాలతో బయటపడ్డారు. ఇదే గ్రామంలో టీడీపీ సానుభూతిపరులకు చెందిన నలుగురి గడ్డివాములు తగలబెట్టారు. కొత్తగణేశునిపాడులో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ వారు దాడి చేసి కొట్టారు. ఇలా అనేక సంఘటనలు జరిగాయి. వైసీపీలోకి వస్తే సరే.. లేదంటే అంతే.. ఆధిపత్యం కోసం ప్రత్యర్థులపై దాడులు.. హత్యలు సాగించారు. పల్నాడులో పట్టపగలే హత్యలు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఐదేళ్లు వరసగా ఘటనలు చోటుచేసుకుంటు న్నాయి. ఆర్థిక, రాజకీయపరమైన కారణాలతోపాటు ఆధిపత్యం కోసం హత్యలు, దాడులు సాగించిన వైసీపీ అరాచకాలను జిల్లా వాసులు ఇంకా మరిచిపోలేదు.

- వినుకొండకు వస్తున్నావ్... అండగా ఉంటానంటున్నావ్
- ఎన్నాళ్లకు జనంలోకొస్తున్నావ్!... చాలా సంతోషం...
- మరి వైసీపీ దాడి చేసిన వారినీ పరామర్శిస్తే బాగుండేదికదన్నా!
- ఎన్నికల ముందూ, తర్వాతా మీ వారు బరితెగించారు
- వారికీ సూక్తులు చెబితే బాగుండేదికదన్నా
- పోలీసుల తీరుపై విమర్శలు అస్సలు బాగోదేమో!
- వారిని మీరు వాడినంత ఎవరూ వాడలేదేమో!

నరసరావుపేట, తెనాలి, జూలై 18, (ఆంధ్రజ్యోతి): నోరు మెదిపితే సీఐడీ... కాలు కదిపితే పోలీస్ కేసు... కబ్జాలపై నిలదీస్తే రౌడీ మూకలతో దాడులు... ఒకటా? రెండా ఎక్కడ చూసినా దౌర్జన్యాలు, దాడులు, అకృత్యాలు, అరాచకాలే. ఇవన్నీ గడచిన ఐదేళ్ల మీ పాలనా కాలంలో సాగిన అధికారిక దందా. మీ దారుణాలు చూడలేక, భరించే ఓపికలేక జనం మీకు వ్యతిరేకంగా తీర్పునిచ్చినా మీ అకృత్యాలు మాత్రం ఆగలేదు. పల్నాడులో అయితే మారణహోమమే సృష్టించారు. వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామంలో తెదేపా నాయకుడు చంద్రయ్యను అదే గ్రామానికి చెందిన వైసీపీ నేతలు పట్టపగలు అందరూ చూస్తుండగానే గ్రామ నడిబొడ్డున గొంతుకోసి హత్యచేశారు. ఇలాంటి సంఘటనలు పల్నాడు జిల్లాలో కోకొల్లలు, అంతేనా ప్రశాంతంగా ఉండే డెల్టా విషయానికి వస్తే.. 'ఇక సెలవు' అని పోస్ట్ పెట్టినందుకు ఓ నాయీబ్రాహ్మణుడి దుకాణాన్నే తగలెట్టేశారు. జనసేన జెండా పెట్టినందుకు ఇంటిపై దాడిచేసి విచక్షణా రహితంగా కొట్టారు. ఇట్లా చెబుతూపోతే మీ మూకలు చేసిన దారుణాలు ఎన్నో! మీరు అధికారంలో ఉండగా అన్యాయం జరిగిందని కన్నీరు పెట్టుకున్నా కరగని మనసు ఇప్పుడు చలించిందా? మీలో మానవత్వం ఇన్నాళ్లకు నిద్రలేచిందా! నిజంగా జనం, కార్యకర్తలకోసమే వస్తున్నారా? లేక ఇదీ రాజకీయమేనా? జనం కోసమే అయితే మీరు పరామర్శించాల్సిన కుటుంబాలు చాలానే ఉన్నాయి. వైసీపీ కార్యకర్తలతోపాటు, మీ పార్టీ గూండాలు చేసిన దాడుల్లో గాయపడి, ఆసుపత్రుల్లోచేరి ప్రాణాల కోసం పోరాడుతున్న టీడీపీ, జనసేన కార్యకర్తలను, వారి కుటుంబాలను కూడా పరామర్శిస్తే, వారికీ అండగా నిలిస్తే చాలా సంతోషం జగనన్నా. మీరు చెప్పాల్సిన శ్రీరంగ నీతులు, మానవత్వం తాలూకు సుభాషితాలు మీ ప్రభుత్వం పడిపోయాక కూడా ఆపకుండా దాడులకు తెగబడుతున్న మీ అనుచరులకు, కార్యకర్తల ముసుగులో వీరంగం చేస్తున్న గూండాలకు కూడా చెప్పగలిగితే రాష్ట్రంలో శాంతియుత వాతావరణం నెలకొనే అవకాశం ఉంటుందని బాధితులు వాపోతున్నారు.

మరో చంబల్ తరహాలో పల్నాడు జిల్లా

మేం చెప్పిందే జరగాలి..అడ్డొస్తే అంతమొందిస్తాం.. మీకు దిక్కున్న చోట చెప్పుకోండి..మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు. పల్నాడులో ఐదేళ్లు వైసీపీ నేతల బెదిరింపులివి. గ్రామాల్లోని ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలను తమవైపు రావాలని బెదిరించటం.. వినకపోతే వారిపై అక్రమ కేసులు బనాయించడం.. అప్పటికీ లొంగకపోతే దాడులు.. హత్యలు చేసి విష సంస్కృతి పల్నాడు జిల్లాలో గత ఐదేళ్లు సదరు నేతలు అమలు చేశారు. తమ ఆధిపత్యానికి అడ్డుగా ఉంటున్నారనుకున్న వారిని వైసీపీ శ్రేణులు అంతమొందించాయి. హత్యల పరంపరను కొనసాగించాయి. మాచర్ల, గురజాల, నరసరావుపేట నియోజకవర్గాల్లో ఈ ఆరాచక ధోరణి అమలు చేశారు. గ్రామాల్లో బలంగా ఉండే ప్రతిపక్ష పార్టీల నేతలు, కార్యకర్తలు, సానుభూతిపరులే లక్ష్యంగా ఈ హత్యలన్నీ ఒక దాని తర్వాత మరొకటి ప్రణాళిక ప్రకారం సాగించారు. దాడులు, హత్యలు జరిగితే.. అవి వ్యక్తిగత, పాత కక్షలతోనే జరిగాయని.. రాజకీయాలతో సంబంధం లేదని వెనువెంటనే పోలీసు అధికారులు ప్రకటించేవారు. కనీస దర్యాప్తు కూడా లేకుండానే ఆ హత్యలు, దాడులతో వైసీపీ నేతలకు సంబంధం లేదంటూ తేల్చేసేవారు. తమ ప్రాణాలకు ముప్పు ఉందని ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు తెలియజేసినా వారి రక్షణకు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గ్రామాల్లో వైసీపీని ఎదిరిస్తే ప్రాణాలకే ముప్పు ఏర్పడేది. కొందరైతే గ్రామాలు వదలి వెళ్లి బంధువుల ఇళ్లలో తలదాచుకు న్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ పరిస్థితి కొనసాగింది.

శాంతియుత డెల్టాలో దారుణాలెన్నో!

ఎన్నికలకు ముందు అధికారం, అన్నిరకాల అండదండలు ఉండటంతో చేసిన దాడులు, దారుణాలెన్నో ఉన్నాయి. నిత్యం పచ్చని పైరుగాలులతో, ప్రశాంతంగా ఉండే డెల్టా ప్రాంతం కక్షలు, కార్పణ్యాలతో రగిలిపోయింది. అప్పుడు అధికారం, పోలీస్ యంత్రాంగం పూర్తిగా సహకరించాయి కదా అనుకుంటే, అధికారంలో నుంచి దిగిపోయాక కూడా దాడులు ఆగలేదు. గుంటూరు, బాపట్ల జిల్లాల్లో కృష్ణా డెల్టా ప్రాంతం కిందున్న నియోజకవర్గాలు తెనాలి, పొన్నూరు, మంగళగిరి, వేమూరు, రేపల్లె, బాపట్ల నియోజకవర్గాల్లో జరిగిన దాడులే దీనికి ఉదాహరణ. తెనాలి నియోజకవర్గంలో ఎన్నికల తర్వాత కూటమి గెలవటంతో బాణాసంచా పేల్చుకుంటూ సంబరాలు చేసుకుంటున్న టీడీపీ కార్యకర్తలపై వైసీపీ కౌన్సిలర్, ఆయన అనుచరులు దాడిచేయటం అమానుషమే. దీనికి అప్పట్లో పోలీసులు కూడా మీ పార్టీ నాయకులకే అండగా నిలిచిన పరిస్థితి. మరో కౌన్సిలర్ టీడీపీ నాయకులపై కత్తులతో దాడిచేయించిన సంఘటనా మర్చిపోలేనిదే. తేలప్రోలులో జనసేన జెండా ఇంటిపై కట్టాడని, జెండా దిమ్మె ఏర్పాటు వివాదాన్ని పెంచి, చివరకు కత్తులతో దాడిచేసిన సంఘటన తాజాగా జరిగిందే. బాధితుడు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడుకూడా. మరో వైసీపీ నాయకుడు టీడీపీ కార్యకర్తపై దాడిచేసి, తల పగులగొట్టిన సంఘటనా తాజాగానే జరిగింది. ఇతనూ ఆసుపత్రిలోనే ఉన్నాడు. బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం అద్దేపల్లిలో టీడీపీ దిమ్మెను పగులగొట్టి, తర్వాత టీడీపీ శ్రేణులపై దాడులకు దిగిన పరిస్థితి. అమృతలూరు మండలం పాంచాలవరం గ్రామంలో ఓ నాయీబ్రాహ్మణుడు ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక 'ఇక సెలవు జగన్' అని ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెట్టినందుకు వైసీపీ శ్రేణులు అతని మంగలి షాప్ బడ్డీనే తగలబెట్టేశారు. అతను జీవనాధారం పోయి రోడ్డున పడిన పరిస్థితి. ఇటువంటివారిని పరామర్శిస్తే నిజంగా జనం కోసం జగన్ జనంలోకి వచ్చినట్లువుతుందని, లేకుంటే.. కేవలం రాజకీయ దురుద్దేశమే అవుతుంది జగనన్నా.


వైసీపీ మూకల దాడిలో గాయపడ్డ సీఐ నారాయణ స్వామి (ఫైల్)


వైసీపీ మూకల చేతిలో హత్యకు గురైన జల్లయ్య (ఫైల్)


తీవ్ర గాయాలతో టీడీపీ ఏజెంట్ శేషగిరిరావు (ఫైల్)


వైసీపీ మూకల దాడిలో గాయపడిన శేరెడ్డి మంజుల (ఫైల్)

నేడు వినుకొండలో జగన్ పర్యటన

పాత కక్షలతోనే హత్య : ఎస్పీ శ్రీనివాసరావు

పాత కక్షలతో రషీద్ హత్య జరిగిందని పల్నాడు ఎస్పీ కే శ్రీనివాసరావు ప్రకటించారు. అయితే దీనిని రాజకీయం చేసి టీడీపీకి అంటగట్టేందుకే జగన్ వినుకొండ వస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రషీద్ హత్య సంఘటనపై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు డిమాండ్ చేశారు. రషీద్ హత్యను రాజకీయ లబ్ధి కోసం వాడుకునేందుకు జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేలు యత్నిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనంతా అరాచకాలతో సాగిందని జిల్లాలో ఎవరిని అడిగినా చెబుతారు. నాడు అరాచకాలతో బరితెగించి ఎదురు ప్రశ్నించిన వారిని వైసీపీ నేతలు అడ్డుతొలగించారు. వినుకొండలో హత్యకు గురైన షేక్ రషీద్ కుటుంబాన్ని పరామర్శించడానికి వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం వస్తున్నారు. ఐదేళ్లు తన పాలనలో జిల్లా దాడులు.. హత్యలతో అట్టుడికిపోతే నోరు మెదపని జగన్‌రెడ్డి నేడు అరాచకపాలన జరుగుతుందని ఆయన విమర్శించడాన్ని జిల్లా వాసులు నవ్వుకుంటున్నారు. నాడు అరాచకాలు జగన్‌కు కనపడలేదా అని నిలదీస్తున్నారు.

టీడీపీ నేతల ఆస్తుల ధ్వంసం

మాచర్ల పట్టణంలో టీడీపీ ఆధ్వర్యంలో ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని అప్పటి టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మానందరెడ్డి నిర్వహిస్తుండగా పిన్నెల్లి రౌడీ గ్యాంగ్ చిన కాన్వెంట్ వద్ద కవ్వింపు చర్యలకు పాల్పడి టీడీపీ నేతల కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. పోలీసులు ఆ కార్యక్రమాన్ని నిలిపివేసి బ్రహ్మానందరెడ్డిని ఊరు నుంచి బయటకు పంపేశారు. తదుపరి రామకృష్ణారెడ్డి సోదరుడు వెంకట్రామిరెడ్డి తన రౌడీ గ్యాంగుతో పట్టణంలో టీడీపీకి చెందిన కార్లు, గృహాలు, పార్టీ కార్యాలయాలు ధ్వంసం చేసి తగులబెట్టారు. మాచర్ల పట్టణాన్ని రావణకాష్టంగా మార్చారు. దీనిపై పోలీసులు తిరిగి టీడీపీ వారిపైనే 307 కేసులు కట్టి జైలుపాలు చేశారు.

సార్వత్రిక ఎన్నికల్లో అకృత్యాలు...

స్వార్వత్రిక ఎన్నికల ముందు రోజు రెంటచింతలలో టీడీపీ ఏజెంట్లు సిద్దయ్య, మల్లయ్యలపై వైసీపీ రౌడీ మోర్తాల ఉమామహేశ్వరరెడ్డి దాడి చేసి తలలు పగులకొట్టారు. పోలింగ్ రోజు మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రౌడీ గ్యాంగ్‌ను వేసుకొని పాలువాయి గేటులోని 202 పోలింగ్ బూత్‌లో ప్రవేశించి ఈవీఎం, వీవీ ప్యాడ్స్‌ను ధ్వంసం చేశారు. అడ్డుకోబోయిన టీడీపీ ఏజెంట్ నంబూరి శేషగిరిరావును తన రౌడీ గ్యాంగ్‌తో పదునైన ఆయుధాలతో దాడి చేయించారు. ప్రశ్నించిన మరో మహిళ చెరుకూరి నాగశిరోమణిను దూషిస్తూ వేలుచూపిస్తూ మరీ బెదిరించారు. ఇదే మండలంలోని రెంటాలలో టీడీపీ ఏజెంట్ శేరెడ్డి మంజుల, గోపాలరెడ్డిలపై దాడి, కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మానందరెడ్డిపై కారం చల్లి దాడికి యత్నించడం, కారు ధ్వంసం చేసి తగులబెట్టారు. కేపీ గూండెంలో ఏజెంట్ రేఖ్యానాయక్‌పై దాడి చేసి ఏజెంట్లను పోలింగ్‌బూత్‌ల నుంచి బయటకు లాగేశారు. పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి కండ్లకుంటలో ఏజెంట్‌గా కూర్చున్న నోముల మాణిక్యరావు కుటుంబ సభ్యులపై దాడి చేయించి వీడియో చూపించి ఏజెంట్‌ను బయటకు లాగేశారు. అలాగే మాచర్ల పట్టణంలో పీడబ్ల్యూడీ కాలనీలో తన గ్యాంగ్‌ను వెంట వేసుకొచ్చి కారుతో ఢీకొట్టి 8 మందిని తీవ్రంగా గాయపరిచారు. టీడీపీ నేత యెనుముల కేశవరెడ్డి గృహాన్ని ధ్వంసం చేశారు. పోలింగ్ మరుసటి రోజు కారంపూడిలో రౌడీ గ్యాంగును వెంటబెట్టుకొని వెళ్లి టీడీపీ కార్యాలయం, టీడీపీ సానుభూతిపరుల దుకాణాలు, కార్లు ధ్వంసం చేసి నిప్పు పెట్టారు. అడ్డుకున్న సీఐ నారాయణస్వామి తలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఇలా గత ఐదేళ్లలో వైసీపీ అరాచకాల చిట్టాకు అంతేలేదు.

భూ సేకరణ తప్పదా?

- సీడ్ యాక్సెస్ రోడ్డుకు భూములపై తర్జన భర్జనలు
- పూలింగ్ కింద తీసుకోవాలంటే రిటర్నబుల్ ప్లాట్లకు పెద్దగా భూముల్లేవు
- సీడ్ యాక్సెస్ రోడ్డుతో పాటు ఈ-11, ఈ-13 రోడ్ల అభివృద్ధికి ప్రణాళికలు
- అన్నింటికీ కలిపి భూ సేకరణ దిశగా వెళితేనే ప్రయోజనకరమని భావన
- ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూపు

విజయవాడ, జూలై 18(ఆంధ్రజ్యోతి): సీడ్ యాక్సెస్ రోడ్డుకు 2వ దశ (బ్యాలెన్స్) పనులకు భూసేకరణ దిశగానే వెళ్లాలని సీ ఆర్‌డీఏ మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. ఆ దిశగా వెళ్లాలన్న ది అధికారికంగా సీఆర్‌డీఏ ప్రకటించలేదు. భూసేకరణ అంశం పై మరోమారు సీఆర్‌డీఏ అధికారులు పునరాలోచన చేయాలని భావిస్తున్నారు. రెండు రోజుల్లో ఈ అంశంపై పూర్తి స్పష్టత వస్తుంది. ప్రభుత్వస్థాయిలో జోక్యం ఉంటే భూసమీకరణ వైపు మొగ్గుచూపే అవకాశాలున్నాయి. అమరావతి పునర్నిర్మాణ పనుల్లో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు యుద్ధప్రాతిపదికన సీడ్ యాక్సెస్ రోడ్డును పూర్తి చేయాలన్నది సీఆర్‌డీఏ ప్రధాన లక్ష్యం. సీడ్‌యాక్సెస్ రోడ్డు ప్రస్తుతం వెంకటపాలెం వరకు 18 కిలోమీటర్ల నిడివిన ఉంది. ఇక్కడినుంచి మరో 3 కిలోమీటర్ల మేర బ్యాలెన్స్ పనులు మిగిలిఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పలువురు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. దీం తో ఉండవల్లి మండలం పెనుమాక నుంచి కనకదుర్గ వారధి వద్ద మణిపాల్ హాస్పిటల్ పక్కనుంచి ఎన్‌హెచ్-16కు సీడ్ యాక్సెస్ రోడ్డును అనుసంధానించటం ఆగిపోయింది. మళ్లీ ప్రభుత్వం కొలువు తీరాక.. అమరావతి రాజధాని విధ్వంసాన్ని కళ్లారా చూసిన అనుభవంతో తమకు తాముగా సహకరించేందుకు రైతులు సంసిద్ధమయ్యారు. మంత్రి నారాయణ రాజధా నిలో పర్యటించిన సందర్భంలో రైతులు తమ సమ్మతిని తెలిపారు. దీంతో సీఆర్‌డీఏ అధికారులు రైతులతో సంప్రదింపులు జరిపారు. ఉండవల్లి మండల పరిధిలో భూములు అవసరమైన గ్రామాల్లో సమావేశాలను తలపెట్టారు. రైతుల్లో మిశ్రమ అభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి. తమ భూముల ధరలు ఎక్కువగా ఉన్నందున పూలింగ్ ప్యాకేజీని పెంచాలన్నది వీరి ప్రధాన డిమాండ్. దాదాపుగా 2వేల చదరపు గజాల మేర అభివృద్ధి చేసిన ప్లాట్లు కోరుతున్నారు. అందరి రైతుల్లో నూ ఇదే ప్యాకేజీ కావాలన్న డిమాండ్ రావటం లేదు. పలువురు రైతులు ఇంకా ఎక్కువ డిమాండ్ చేస్తున్నారు. రైతుల మధ్య భిన్నాభిప్రాయాలు నెలకొనటంతో ఏకాభిప్రాయానికి వచ్చేవరకు కొంత సమయం ఇవ్వాలని సీఆర్‌డీఏను రైతులు కోరారు. ఫలితంగా రై తులతో సంప్రదింపుల ప్రక్రియను తాత్కాలికంగా సీఆర్‌డీఏ అధికారులు నిలిపివేశారు. రైతులు కోరినట్టుగా గరిష్ఠ ప్యాకేజీ ఇచ్చే విషయంలో కొన్ని సమస్యలున్నాయి. ప్రస్తుతం అదనంగా పూ లింగ్ కింద భూములిచ్చే పరిస్థితి దాదాపుగా లేదని తెలుస్తోంది. పూలింగ్ కింద కొత్తగా రిటర్నబుల్ ప్లాట్లను ఇవ్వటం కొంత కష్టంగానే ఉందని తెలుస్తోంది. పూలింగ్ కింద ప్యాకేజీ కల్పించాలంటే.. ఈ ప్యాకేజీ కోసం మళ్లీ భూములు తీసుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. దీనికితోడు ప్యాకేజీ ఎక్కువగా అడగటం ఇంకాస్త ఇబ్బందిగా ఉంటోంది. దీనికంటే భూసేకరణ దిశగా వెళ్లటం వల్లనే సమస్య తేలిగ్గా పరిష్కారమౌతుందన్న ఆలోచన కూడా చేస్తున్నట్టు తెలుస్తోంది. దీనికితోడు సీడ్‌యాక్సెస్ రోడ్డు (ఈ-3) తో పాటుగా ఈ-11, ఈ-13 రోడ్లను కూడా ఎన్‌హెచ్-16కు అనుసంధానించాలని సీఆర్‌డీఏ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ 2 రోడ్లను ఎన్‌హెచ్-16కు అనుసంధానించటానికి పెద్దగా భూములు అవసరం లేదు. జాతీయ రహదారి దగ్గర అనుసంధానించేచోట కొంతమేర భూములు సేకరించాల్సి ఉంది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని భూసేకరణ దిశగా వెళ్లాలని భావిస్తున్నా. ప్రభుత్వం భూసమీకరణ దిశగానే వెళ్లమంటే మాత్రం ఆ దిశగానే సీఆర్‌డీఏ అడుగులు వేసే అవకాశం ఉంది.

ఉండవల్లిలోని తన నివాసంలో గురువారం ప్రజాదర్బార్‌లో దివ్యాంగుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న నారా లోకేశ్

7లో..



జవహర్ నవోదయ విద్యాలయాల్లో
ఆరోతరగతి ప్రవేశాలు



నవోదయ విద్యాలయ సమితి(ఎన్‌వీఎస్)- దేశ వ్యాప్తంగా ఉన్న జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. 'జవహర్ నవోదయ విద్యాలయ సెలెక్షన్ టెస్ట్(జేఎన్‌వీఎస్‌టీ) 2025' ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఇవి కో-ఎడ్యుకేషనల్ రెసిడెన్షియల్ స్కూళ్లు. బాల బాలికలకు విడివిడిగా హాస్టల్స్ ఉంటాయి. భోజన, వసతి సౌకర్యాలతోపాటు పన్నెండో తరగతి వరకు బోధన ఉచితం. యూనిఫాం, పాఠ్య పుస్తకాలు కూడా ఇస్తారు.

అర్హత: ప్రస్తుతం ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో అయిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్ఐఓఎస్ నుంచి 2024 సెప్టెంబరు 15 నాటికి 'బి' సర్టిఫికెట్ కాంపిటెన్సీ కోర్సు పూర్తిచేసేవారు కూడా అర్హులే. విద్యార్థులు 2013 మే 1 నుంచి 2015 జూలై 31 మధ్య జన్మించి ఉండాలి.

జేఎన్‌వీ సెలెక్షన్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం 2 గంటలు. మొత్తం మార్కులు 100. ఈ పరీక్షలో మూడు సెక్షన్లు ఉంటాయి. వీటిలో మొత్తం 80 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మెంటల్ ఎబిలిటీ టెస్ట్‌లో 40 ప్రశ్నలు అడుగుతారు. దీనికి 50 మార్కులు కేటాయించారు. అర్థమెటిక్ టెస్ట్, లాంగ్వేజ్ టెస్ట్‌ల్లో ఒక్కోదానిలో 20 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో దానికి 25 మార్కులు ఉంటాయి. నెగెటివ్ మార్కులు లేవు. మెంటల్ ఎబిలిటీ టెస్ట్‌కు గంట; మిగిలినవాటికి ఒక్కోదానికి అర్ధ గంట పరీక్ష సమయం ఇస్తారు. విద్యార్థులు బ్లూ/బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌తో ఓఎంఆర్ పత్రం మీద సమాధానాలు గుర్తించాలి. తెలుగు రాష్ట్రాల్లో ఈ పరీక్షని తెలుగు, హిందీ, ఇంగ్లీష్, మరాఠీ, ఉర్దూ, ఒరియా, కన్నడ మాధ్యమాల్లో నిర్వహిస్తారు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **జేఎన్‌వీ సెలెక్షన్ టెస్ట్ తేదీలు:** 2025 జనవరి 18, ఏప్రిల్ 12
- **వెబ్‌సైట్:** www.navodaya.gov.in

దిక్సూచి
DIKSUCHI


సీఈసీఆర్ఐలో బీటెక్

కరైకుడి(తమిళనాడు)లోని సెంట్రల్ ఎలక్ట్రోకెమికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఎస్ఐఆర్-సీఈసీఆర్ఐ)-బీటెక్ (కెమికల్ అండ్ ఎలక్ట్రోకెమికల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో అదర్ స్టేట్ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. జేఈఈ మెయిన్ 2024 ఆలిండియా ర్యాంక్ ఆధారంగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 6
- **ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** ఆగస్టు 9
- **ఆన్‌లైన్ కౌన్సెలింగ్:** ఆగస్టు 21
- **ఫలితాలు విడుదల:** ఆగస్టు 23
- **వెబ్‌సైట్:** cecri.res.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/NKB5u7vలో చదవండి.

ఐఐఎఫ్‌టీలో ఆన్‌లైన్ పీజీ డిప్లొమా



ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- ఎగ్జిక్యూటివ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(ఈపీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది 15 నెలల వ్యవధి గల వీకెండ్ ప్రోగ్రామ్. ఇందులో మూడు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి రెండు సెమిస్టర్లు పూర్తయిన తరవాత ప్రోగ్రామ్‌లో బ్రేక్ తీసుకోవచ్చు. గరిష్ఠంగా మూడేళ్లలో ప్రోగ్రామ్‌ను పూర్తిచేయాల్సి ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌ని వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ప్రత్యేకించారు. దీనిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. వారాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు వరకు సెషన్స్ ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా పోర్ట్ విజిట్, ఇండస్ట్రీ విజిట్, రీసెర్చ్ ప్రాజెక్ట్, అసైన్‌మెంట్స్ ఉంటాయి. సెలెక్షన్ కమిటీ నిర్ణయం మేరకు అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం అయిదేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** www.iift.ac.in

మ్యాట్ నోటిఫికేషన్

ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఏఐఎంఏ)-మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్(మ్యాట్) 2024 ఆగస్టు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ఎగ్జామ్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా దేశంలోని ప్రముఖ బిజినెస్ స్కూళ్లు అందిస్తున్న మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

మ్యాట్ వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో అయిదు సెక్షన్‌లు ఉంటాయి. సెక్షన్‌కు 30 ప్రశ్నలు చొప్పున మొత్తం 150 ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.

ఐబీటీ షెడ్యూల్: ఆగస్టు 14న ఎగ్జామ్ రాయాలనుకొనేవారు ఆగస్టు 9లోపు, ఆగస్టు 23న పరీక్ష రాయాలంటే ఆగస్టు 18లోపు దరఖాస్తు చేసుకోవాలి.

సీబీటీ షెడ్యూల్: చివరి తేదీ: ఆగస్టు 11
- **సీబీటీ టెస్ట్ తేదీ:** ఆగస్టు 18

పీబీటీ షెడ్యూల్: చివరి తేదీ: ఆగస్టు 18
- **పీబీటీ టెస్ట్ తేదీ:** ఆగస్టు 25
- **వెబ్‌సైట్:** mat.aima.in

పంచకర్మ టెక్నీషియన్ కోర్సు

భారత ఆయుష్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్(సీసీఆర్ఏఎస్)- పంచకర్మ టెక్నీషియన్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఏడాది వ్యవధి గల సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ రెగ్యులర్ నాన్ రెసిడెన్షియల్ కోర్సు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ట్రెయినింగ్ పూర్తయ్యేనాటికి అభ్యర్థులకు 18 ఏళ్లు నిండాలి.

- **రిజిస్టర్డ్/స్పీడ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 31
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** అక్టోబరు 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.ccras.nic.in

మరో రికార్డును సాధించిన కల్కి



విడుదలైన మొదటి రోజు నుంచే హిట్ టాక్ తెచ్చుకుని వరుస రికార్డులు సృష్టిస్తోంది 'కల్కి 2898 ఏడీ' సినిమా. ఇటీవలే రూ.1000 కోట్లు సాధించిన ఏడవ ఇండియన్ సినిమాగా.. రెండవ ప్రభాస్ సినిమాగా నిలిచింది. ఈ రికార్డుల వేటలో భాగంగా ఈ సినిమా మరో అరుదైన ఘనతను సాధించింది. టికెట్ బుక్కింగ్స్ అప్లికేషన్ 'బుక్ మై షో'లో అత్యధిక టికెట్స్ బుక్ అయిన సినిమాగా ఖ్యాతి గడించింది. 12.15 మిలియన్స్ (దాదాపు రూ.1 కోటి 25 లక్షలు) టికెట్స్ బుక్ అయిన ఈ సినిమా అంతకుమందు 'జవాన్' సినిమా పేరిట ఉన్న రికార్డును తిరగరాసింది. 'జవాన్' 12.01 (దాదాపు రూ.1 కోటి 20 లక్షలు) మిలియన్స్ టికెట్ బుకింగ్స్‌తో ప్రస్తుతం రెండో స్థానంలో ఉంది. కాగా, నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ పాన్ ఇండియన్ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్‌లో ప్రభాస్ 'భైరవ' పాత్రలో.. అమితాబ్ బచ్చన్ పురాణ యోధుడు 'అశ్వత్థామ'గా..కమల్ హాసన్, దీపికా పదుకొనే, రాజేంద్ర ప్రసాద్ కీలక పాత్రల్లో అలరించారు. ఈ సినిమాకు కొనసాగింపుగా పార్ట్-2 తెరకెక్కనుందని చిత్ర బృందం ప్రకటించిన సంగతి తెలిసిందే.



తమిళ చిత్రకథానాయకుడు విజయ్ నటిస్తున్న తాజా చిత్రం 'ది గోట్' (ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) మ్యూజికల్ ప్రమోషన్స్ మొదలయ్యాయి. సినిమాలోని రెండో పాట 'నిన్ను కన్న కనులే'ను గురువారం విడుదల చేశారు. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ ఫ్యామిలీ సాంగ్‌ను యువన్ శంకర్‌రాజా, ఎస్పీ చరణ్, చిత్ర పాడారు. విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రంలో ప్రశాంత్, ప్రభుదేవా, మోహన్, జయరామ్, స్నేహ, లైలా, మీనాక్షి చౌదరి తదితరులు ఇతర ముఖ్య తారాగణం. కల్పాతి ఎస్ అఘోరమ్, కల్పాతి ఎస్.గణేశ్, ఎస్.సురేశ్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తోంది. వెంకట్ ప్రభు దర్శకుడు.



ఘట్టమనేని వంశం నుంచి
మరో హీరో

హీరో కృష్ణ మనవడు, నటుడు, నిర్మాత రమేశ్‌బాబు తనయుడు జయకృష్ణ హీరోగా అరంగేట్రం చేస్తున్నారు. తన పుట్టినరోజు సందర్భంగా గురువారం పద్మాలయా సంస్థ కార్యాలయంలో అభిమానుల సమక్షంలో జరిగిన కార్యక్రమంలో జయకృష్ణ కేక్ కట్ చేశారు. దివంగత రమేశ్‌బాబు సతీమణి, జయకృష్ణ తల్లి మృదుల ఈ సందర్భంగా మాట్లాడుతూ 'బాబు కోసం కొన్ని కథలు విన్నాం. అందరం కలసి ఓ కథను ఎంపిక చేస్తాం. మంచి బేనర్ ద్వారా చక్కని సినిమాతో జయకృష్ణ త్వరలోనే మీ ముందుకు వస్తాడు' అని చెప్పారు. అభిమానులందరికీ జయకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

అనారోగ్యంతో బాధపడుతున్న
జాన్వీ కపూర్



బాలీవుడ్ నటి జాన్వీకపూర్ ఇటీవలే 'మిస్టర్ అండ్ మిసెస్ మహీ' చిత్రంతో ప్రేక్షకులను అలరించారు. ఓ పక్క వరుస బాలీవుడ్ చిత్రాల్లో నటిస్తూనే.. టాలీవుడ్‌లోనూ ఎన్టీఆర్, రామ్‌చరణ్, నాని సినిమాల్లో కథానాయిక పాత్రను పోషిస్తున్నారీ బ్యూటీ. తాజాగా, ఆమె అనారోగ్యానికి గురయ్యారు. ఫుడ్ పాయిజనింగ్ వల్ల తీవ్ర అనారోగ్యానికి గురైన ఆమెను ముంబైలోని హాస్పిటల్‌లో చేర్చారు. జాన్వీ ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నారని.. తన కూతురి ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు ఆమె తండ్రి బోనీ కపూర్ వెల్లడించారు. ఆరోగ్యం పూర్తిగా కుదుటపడ్డాక ఆమెను హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ చేస్తారని ఆయన చెప్పారు. ప్రస్తుతం జాన్వీ కపూర్ 'ఉలఝ్' అనే చిత్రంలో నటించారు. ఇందులో ఆమె పోషించే పాత్ర పేరు సుహాన భాటియా. దేశంలో అతి పిన్న వయసులోనే డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఎదిగిన సుహాన భాటియా విజయ ప్రస్థానమే ఈ సినిమా కథాంశం. సినిమా ఆగస్టు 2న విడుదలవుతోంది.

దీపావళికి రాకీ రాక



విష్వక్‌సేన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మెకానిక్ రాకీ'. కామెడీ, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంతో రవితేజ ముళ్లపూడి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో విష్వక్ సరసన మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తేదీని మేకర్స్ ఖరారు చేశారు. దీపావళి సందర్భంగా అక్టోబర్ 31న 'మెకానిక్ రాకీ' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు గురువారం ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో విష్వక్‌సేన్ గన్, రెంచ్ పట్టుకొని గంభీరమైన లుక్‌లో కనిపించారు. వైవా హర్ష, హర్షవర్ధన్ కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు. ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: సత్యం రాజేశ్, విద్యాసాగర్ జె, సినిమాటోగ్రఫీ: మనోజ్ కటసాని, ఎడిటర్: అన్వర్ అలీ

వారం రోజుల ముందుగానే..



రక్షిత్ అట్లూరి హీరోగా నటించిన తాజా చిత్రం 'ఆపరేషన్ రావణ్'. న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా దర్శకుడు వెంకట్ సత్య రూపొందించారు. తెలుగు, తమిళ భాషల్లో తయారైన ఈ సినిమాలో సంగీర్తన కథానాయిక. ముందు అనుకున్నట్లు కాకుండా వారం రోజుల ముందుగానే అంటే ఈ నెల 26న సినిమాను విడుదల చేస్తున్నట్లు చిత్ర నిర్మాత ధ్యాన్ అట్లూరి చెప్పారు. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చిందని ఆయన తెలిపారు. రాధిక శరత్‌కుమార్ ఓ కీలక పాత్ర పోషించిన ఈ చిత్రంలో చరణ్‌రాజ్, విద్యాసాగర్, రాకెట్ రాఘవ, రఘు కుంచె ఇతర ముఖ్య తారాగణం.

ట్రోలర్స్‌పై డీజీపీకి
'మా' ఫిర్యాదు

సోషల్ మీడియా వేదికల ద్వారా సినిమా తారలపై జరుగుతున్న ట్రోలింగ్‌పై 'మా' (మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) చర్యలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో భాగంగా 'మా' సభ్యులైన శివ బాలాజీ, రాజీవ్ కనకాల, శివకృష్ణ తెలంగాణ డీజీపీ జితేందర్‌ను కలసి వినతి పత్రం అందించారు. అందులో ఈ ట్రోలింగ్స్‌కు పాల్పడుతున్న 250 యూట్యూబ్ చానళ్లపై చర్యలు తీసుకోవాలని 'మా' సభ్యులు డీజీపీని కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన డీజీపీ.. సైబర్ సెక్యూరిటీ సహకారంతో ఈ అంశంపై చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామని.. అందులో ఇటువంటి ట్రోలర్స్‌పై నిఘా పెడతామని 'మా' సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా 'మా' సభ్యులు మాట్లాడుతూ "ఈ ట్రోలింగ్స్ హద్దులు దాటిపోయాయి. వీటి వల్ల చాలా మంది నటీనటులు ఇబ్బంది పడుతున్నారు. 24 గంటల్లోపు ఓ ప్రత్యేక కో ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేసి ట్రోలింగ్ చేసే చానళ్లను గుర్తిస్తాం" అని చెప్పారు.

కశ్మీర్ నేపథ్యంలో...



శివ కార్తికేయన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'అమరన్'. కమల్‌హాసన్ తన సొంత బేనర్ రాజ్‌కమల్ ఇంటర్నేషనల్ ఫిల్మ్స్‌పై సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్‌తో కలసి నిర్మిస్తున్నారు. సాయిపల్లవి కథానాయిక. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. దీపావళి సందర్భంగా అక్టోబర్ 31న 'అమరన్' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ బుధవారం ప్రకటించారు. ప్రముఖ జర్నలిస్ట్, రచయిత శివ్ అరూర్ రచించిన 'ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్' పుస్తకంలోని 'మేజర్ వరదరాజన్' జీవిత గాథ ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. కశ్మీర్ నేపథ్యంలో యాక్షన్ ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో సరికొత్త పాత్రలో శివకార్తికేయన్ కనిపించనున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సీహెచ్ సాయి.

హతుడు, నిందితుడు వైసీపీ వర్గీయులే..

- ఇద్దరూ వైసీపీ నేత పీఎస్ ఖాన్ అనుచరులు
- ఇది వ్యక్తిగత కక్షలతో జరిగిన హత్య..
- ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



వినుకొండ, జూలై 18: వినుకొండ పట్టణంలో బుధవారంరాత్రి జరిగిన హత్యలో హతుడు, నిందితుడు వైసీపీ వర్గీయులేనని, గతంలో వినుకొండ పట్టణ వైసీపీనేత పీఎస్ ఖాన్‌కు వారిద్దరూ ముఖ్య అనుచరులేనని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. గురువారం ఆయన టెలీకాన్ఫరెన్స్‌లో విలేకర్లతో మాట్లాడుతూ.. ఇలాంటి దారుణమైన ఘటనలు జరగడం ఎంతో బాధాకరమని, తనను ఎంతో కలచివేసిందని దిగ్భ్రాంతిని వ్యక్తంచేశారు. ఈ హత్య ఇద్దరు వ్యక్తులకు, రెండు కుటుంబాలకు సంబంధించిందని, టీడీపీకి దీనితో ఎటువంటి సంబంధం లేదన్నారు. రషీద్‌కు గతంలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, పీఎస్ ఖాన్‌లు అండగా ఉండి నిందితుడు జిలానీ ఇంటి పైకి గతేడాది దాడికి పంపించారని, ఆ సమయంలో జిలానీ ఇంట్లో లేకపోవడంతో అతని అన్న జానీ, ఇంట్లోని చిన్నారిపై దాడికి పాల్పడి వారిద్దరినీ గాయపరిచారని, ఇంటి బయట ఉన్న బుల్లెట్ వాహనాన్ని తగులబెట్టించారని ఆరోపించారు. అప్పుడే చట్టప్రకారం రషీద్‌పై చర్యలు తీసుకొనుంటే ఇప్పుడు అతడు మరణించేవాడు కాదన్నారు. బొల్లా, పీఎస్ ఖాన్ రషీద్‌కు అండగా ఉండడం, జిలానీపై 307 సెక్షన్ క్రింద మర్డర్ కేసు పెట్టించడంతో అప్పటి నుండి జిలానీ వీళ్ళపై వ్యక్తిగత ద్వేషాన్ని పెంచుకొన్నాడన్నారు. గతంలో బొల్లా, పీఎస్ ఖాన్ చేసిన పని ఒకవ్యక్తి మరణానికి, మరోవ్యక్తి జైలుకి వెళ్ళడానికి కారణమయ్యాయన్నారు. జిలానీ రషీద్‌పై వ్యక్తిగత ద్వేషాన్ని పెంచుకోవడం వల్లే హత్య చేయడం జరిగిందన్నారు. దర్యాప్తు చేయించి దోషులు ఎంతటివారైనా కఠినంగా శిక్షిస్తామని, రషీద్ కుటుంబాన్ని ఆదుకొంటామన్నారు. విషయంపై జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో మాట్లాడామని, దోషులను కఠినంగా శిక్షించాలని తెలియజేశామన్నారు.

ప్రజల భూములు దోచేశారు..

- 1.75 లక్షల ఎకరాల భూ ఆక్రమణలకు పాల్పడ్డ వైసీపీ నేతలు
- వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, జూలై 18: గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో 1.75 లక్షల ఎకరాలకు పైగా భూములను ఆక్రమించుకొని రాష్ట్రంలో దోపిడీ కోరు పాలనను సాగించారని, జీవీ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ వైసీపీపాలనలో పట్టపగ్గాలు లేకుండా సాగిన అవినీతి, అక్రమాలను ఆధారాలతో సహా బయట పెట్టేందుకే సీఎం చంద్రబాబు శ్వేతపత్రాలు విడుదల చేస్తున్నారని, వాటితో వైసీపీలోని అనకొండలు, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి నిజస్వరూపం ప్రజలకు తెలుస్తుందన్నారు. వైసీపీ నేతలు ప్రతిష్టాత్మకంగా చెప్పుకొన్న పేదలకు సెంటు ఇళ్ళ స్థలాల్లో 10 వేల ఎకరాలు అక్రమాలు జరిగాయంటే వైసీపీ పాలన ఎలా సాగిందో అర్థం చేసుకోవచ్చన్నారు. గత ఐదేళ్ళలో వైసీపీ నేతలు సాగించిన భూ ఆక్రమణల విలువ 35,576 కోట్లు పైమాటేనని తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో అడ్డగోలుగా భూదోపిడీకి తెగబడొచ్చని భావించిన వైసీపీ నేతల కుట్రలకు పాల్పడ్డారన్నారు. ఇవేకాక ఇసుక దందాలతో రూ.9750 కోట్లు దోచుకొన్నారన్నారు. సీఎం చంద్రబాబు తీసుకురానున్న యాంటీ ల్యాండ్ గ్రాబింగ్ చట్టంతో కబ్జాకోరుల గుండెల్లో రైళ్ళు పరిగెత్తడం ఖాయమన్నారు. త్వరలో మరికొన్ని శ్వేతపత్రాలతో వైసీపీ దోపిడీని ఆధారాలతో ప్రజల ముందు పెడతామని ఎమ్మెల్యే జీవీ తెలిపారు.

వామ్మో... జిల్లా పరిషత్ !

- విధులకు రావాలంటే బెంబేలెత్తుతున్న ఉద్యోగులు
- పూర్తిగా శిథిలావస్థకు చేరిన 60 సంవత్సరాల భవనం
- వర్షం కురిస్తే చాలు.. పెచ్చులూడిపడుతున్న పైకప్పు
- చైర్‌పర్సన్ 30 సార్లు వెళ్లినా కనికరించని పాత సీఎం
- కూటమి రాకతో ఉద్యోగుల్లో చిగురిస్తున్న ఆశలు



జడ్పీ కార్యాలయం పెచ్చులూడి పడుతున్న దృశ్యాలు

గుంటూరు సిటీ, జూలై 18 : ప్రస్తుతం ఉన్న జిల్లా పరిషత్ భవనాన్ని 1964లో నిర్మించారు. అప్పటి నుంచి కనీస మరమ్మతులు కూడా చేయలేదు. ఇప్పుడు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వర్షానికి పైకప్పు పెచ్చులూడి పడుతుంది. పెచ్చులూడి పడటం వలన ఈ మధ్య కాలంలో కొందరు ఉద్యోగులు గాయపడ్డారు. అందువల్ల వర్షాకాలం వచ్చిందంటే అక్కడి ఉద్యోగుల గుండెల్లో రైళ్ల పరుగెతున్నాయి. విధులకు హాజరు కావటానికి బెంబేలెత్తుతున్నారు. సమస్యను జడ్పీ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సుమారు 30 సార్లు అప్పటి ముఖ్యమంత్రిని కలిసి జిల్లా పరిషత్ కార్యాలయం నిర్మాణానికి రూ.11 కోట్ల రూపాయలు కేటాయించాలని విన్నవించారు. అప్పటికప్పుడు నిధులు విడుదల చేస్తానని చెప్పిన నాటి ముఖ్యమంత్రి మాట తప్పారు..మడమ తిప్పారు.కూటమి ప్రభుత్వం రాకతో కనీసం ఇప్పుడైనా కొత్త భవనం నిర్మాణం జరుగుతుందన్న ఆశలు ఉద్యోగుల్లో చిగురిస్తున్నాయి. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి జడ్పీ ఛైర్ పర్సన్ కత్తెర హెని క్రిస్టినా ఈ సమస్యను తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. వచ్చే జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఈ అంశం ప్రధానంగా చర్చకు రానుంది.

అన్ని ఛాంబర్లు అంతే...

జడ్పీలో కీలకమైన ఛైర్మన్, సీఈఓ, డిప్యూటీ సీఈఓలకు ఛాంబర్లు ఉన్నాయి. అవీ పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. కమాండ్ కంట్రోల్ రూమ్, ఏసీ, నాన్‌ఏసీ సమావేశ మందిరాలు, అన్ని సెక్షన్ల గదులు పెచ్చులూడి పడుతున్నాయి. ఆదాయం తీసుకువచ్చే ఏసీ సమావేశ మందిరంలో వర్షంవస్తే నీళ్ళు ధారగా పడుతున్నాయి. పైన స్లాబు పూర్తిగా పాడుకావటం వలన నీరు లోపలికి ప్రవేశించి ఇనుము పూర్తిగా తుప్పు పట్టిందని అధికారులు చెబుతున్నారు. దానివల్ల పైకప్పు ఎప్పుడైనా కూలిపడే అవకాశం ఉందని అంటున్నారు. జిల్లా పరిషత్ నూతన భవనం నిర్మాణం కోసం రూ.11 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసినట్లు జడ్పీ ఛైర్ పర్సన్ కత్తెర హెని క్రిస్టినా చెబుతున్నారు. త్వరలో సీఎం చంద్రబాబు నాయుడును కలిసి ఈ విషయం పై చర్చిస్తామని చెప్పారు.



ప్రమాదభరితంగా దర్శనమిస్తున్న భవనాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎండీ ఫరూక్

పులివెందుల సంస్కృతికి ఆద్యుడు జగన్

- పర్యవసానంగానే రాష్ట్రంలో హింసాత్మక ఘటనలు
- రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎండీ ఫరూక్

వినుకొండటౌన్ , జూలై 18: రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో హింస, దోపిడీ, హత్యలకు కారణం పులివెందుల సంస్కృతి వ్యాప్తికావటమేనని, ఇందుకు ఆద్యుడు మాజీ సీఎం జగన్‌రెడ్డేనని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎండీ ఫరూక్ అన్నారు. గురువారం వినుకొండకు వచ్చిన ఆయన స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరుతో మాట్లాడారు. వినుకొండకు చెందిన షేక్ రషీద్, జిలానీలు ఇద్దరూ వైసీపీ వారేనని, గతంలో ఇద్దరి మధ్య జరిగిన ఘర్షణల్లో గత వైసీపీ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం, ఒక వర్గాన్ని పోత్సహించడంతోనే జిలానీ చేతిలో రషీద్ హత్యకు గురయ్యాడన్నారు. ఈ హత్యను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, నిందితులు ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని మంత్రి అన్నారు. వినుకొండలో రషీద్ హత్యకు కేవలం గత పాలకుల వైఫల్యాలే కారణమని ఆరోపించారు. కార్యక్రమంలో న్యాయవాది ఎన్ రామకోటేశ్వరరావు, షేక్ జానీ, సుభానీ పాల్గొన్నారు.

ఐదేళ్లలో 1.75 లక్షల ఎకరాల ఆక్రమణలు

- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో అడ్డగోలు దోపిడీకి యత్నం
- ఆ చట్టం రద్దుతో ఊపిరి పీల్చుకున్న ప్రజలు
- పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు, జూలై 18 : ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో రూ 35,576 కోట్ల విలువ చేసే 1.75 లక్షల ఎకరాల భూములు ఆక్రమణలు జరిగాయని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మట్లాడుతూ.. రాష్ట్రంలో భూదందాలు, సహజ వనరుల దోపిడీ తప్పా జరిగిన అభివృద్ధి ఏమి లేదన్నారు. జగన్ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలు, దోపిడీలపై ప్రజలకు వాస్తవాలు తెలియాలన్నారు. ప్రజలకు జగన్ ఆయన మంత్రివర్గం చేసిన అవినీతిని తెలపాలనే సీఎం చంద్రబాబు శ్వేత పత్రం విడుదల చేశారన్నారు. వైసీపీ నేతలు ఏ విధంగా అక్రమాలు, దందాలు చేశారో, ఎంత దోచుకున్నారో ఆధారాలతో సహా శ్వేత పత్రాల ద్వారా బయట పెడుతున్నామన్నారు. ఇళ్ళ పట్టాల పేరుతో పది వేల ఎకరాలు, ఇసుక దందాను రూ 9,750 కోట్లు దోచుకున్నారన్నారు. తమ భూ దోపిడీని తీవ్రతరం చేస్తూ వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ జీవో నెంబరు 512ను కూటమి ప్రభుత్వం రద్దు చేయటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారన్నారు. విశాఖ, చిత్తూరు, ఒంగోలు జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లోవేల ఎకరాల భూములను ఆక్రమించుకొని కోట్లు కూడబెట్టుకున్నారని అన్నారు. వైసీపీ కార్యాలయాల కోసం రెండేసి ఎకరాలను నామ మాత్రపు రుసుంతో 33 సంవత్సరాల లీజుకు ఇచ్చుకొని, రూ.300 కోట్ల విలువైన భూమి కాజేశారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

కారంపూడి, జూలై 18: అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పేటసన్నిగండ్లలో బుధవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన బొరిగొర్ల నాగరాజు (41) ఐదేళ్లుగా మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని మిర్చి సాగుచేశాడు. పంట సరిగా పండగా, సరైన దిగుబడి రాకపోవడంతో సుమారు రూ. 9.50 లక్షల దాకా అప్పులు పాలయ్యాడు. రాత్రి 11 గంటల సమయంలో గ్రామంలోని ఎంపీయూపీ స్కూలు వద్ద ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ప్రజాదర్బార్‌లో ప్రజలకు లోకేశ్ భరోసా

- సమస్యల పరిష్కారానికి యువనేత చొరవ
- 18వ రోజు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు



మంత్రి నారా లోకేశ్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఓ యూనియన్ నేతలు

తాడేపల్లి, జూలై 18: కష్టాల్లో ఉన్న వారికి నేనున్నాంటూ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ భరోసా ఇస్తున్నారు. సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఉండవల్లిలోని నివాసంలో 18వ రోజు గురువారం ప్రజాదర్బార్‌లో విన్నపాలు స్వీకరించిన లోకేశ్ ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

నందిగం సురేశ్ టిప్పర్ లారీ నా మనవడిని బలితీసుకుంది

మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు చెందిన టిప్పర్ లారీ ఢీకొని నాలుగేళ్ల తన మనవడు దుర్మరణం పాలయ్యాడని తగిన న్యాయం చేయాలని మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లికి చెందిన తాళ్ళ నాగరాజు మంత్రి నారా లోకేశ్‌ను కలిసి కన్నీటిపర్యంతమయ్యారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను విన్న లోకేశ్ పరిశీలించి తగిన న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు.

నివాస స్థలాన్ని విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, మంగళగిరి నియోజక వర్గం ఉండవల్లికి చెందిన భవనాశి రాజరాజేశ్వరి లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. దుగ్గిరాల మండలం శృంగారపురంలో మట్టి రోడ్ల కారణంగా ఇబ్బందులు పడుతున్నామని సీసీ రోడ్లు నిర్మించాలని గ్రామ సర్పంచ్ యలవర్తి అంకమయ్య కోరారు. పుట్టకతోనే రెండు కిడ్నీలు పాడైపోయిన తమ కుమారుడికి వైద్య సాయం అందించి ఆదుకోవాలని మంగళగిరి పట్టణానికి చెందిన తాళ్లూరి శిరీష విజ్ఞప్తి చేశారు. తన 8 నెలల కుమారుడికి వైద్య సాయం చేయాలని తాడేపల్లికి చెందిన పఠాన్ అల్లాబి విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తానని మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు.



దివ్యాంగుడి అర్జీని పరిశీలిస్తున్న మంత్రి నారా లోకేశ్



ఇసుక కోసం వచ్చిన వారితో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ హరిహరనాథ్

కొల్లిపర, జూలై 18 : ఉచిత ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ యడ్లపల్లి హరిహరనాథ్ అన్నారు. మండల పరిధిలోని మున్నంగి ఇసుక లోడింగ్ స్టాక్ పాయింట్‌లో అక్రమ రవాణా జరుగుతున్నట్లు ఆరోపణలు రావటంతో గురువారం ఆయన తనిఖీ నిర్వహించారు. స్టాక్ పాయింట్‌లో ఏర్పాటు చేసిన క్యూ ఆర్ కోడ్ ద్వారా డిజిటల్ చెల్లింపుల విధానాన్ని పరిశీలించారు. ఇసుక లోడింగ్ పాయింట్లలో ఉన్న సిబ్బంది పని తీరు గురించి ఇసుక కోసం వచ్చిన వారిని అడిగి తెలుసుకున్నారు. రోజుకు 400 రసీదులు మాత్రమే వాహనదారులకు ఇవ్వాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ సందర్భంగా హరిహరనాథ్ మాట్లాడుతూ క్యూఆర్ కోడ్ ద్వారా డిజిటల్ చెల్లింపులతో టన్ను ఇసుకకు రూ.250లు చెల్లించాల్సి ఉంటుందని ఎవరికి అదనంగా డబ్బులు ఇవ్వాల్సినవసరం లేదన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే వారిపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. ఇసుక లోడింగ్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణుప్రసాద్, డీఆర్‌డీఏ ఏపీఎం ప్రియదర్శిని, శ్రీనిధి ఏజీఎం చెన్నకేశవులు, ఆర్ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృత దేహం లభ్యం



పంట కాలువలో పడివున్న వ్యక్తి మృతదేహం

వినుకొండటౌన్, జూలై 18: మండలంలోని గోనుగుంట్ల వారిపాలెం గ్రామ సమీపంలోని పంట కాలువలో గురువారం గుర్తుతెలియనివ్యక్తి మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించారు. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. మృతుడు సుమారు ఆరు అడుగులు ఉండి, ఒంటి పై తెల్లని బన్నీ, ఆరంజి రంగు చొక్కా, నల్లని డ్రాయర్, చుక్కల లుంగీ ధరించి ఉన్నాడు. మృతుడు చేతిపై పీ.అంజి అనే పేరు ఉన్నట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృత దేహాన్ని వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సాంబశివరావు తెలిపారు.

ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీగా

ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు



ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధర్ రావు

పెదకాకాని, జూలై 18 : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్‌గా సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ కంచర్ల గంగాధరరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సౌరబ్‌గౌర్ జీవో ఆర్.టీ.నెంబర్ 122 విడుదల చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ప్రొఫెసర్ గంగాధరరావు ఇన్‌చార్జి వైస్‌చాన్సలర్‌గా విధులు నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్‌లు స్వచ్ఛందంగా తమ పదవులకు రాజీనామా చేసిన నేపథ్యంలో ప్రభుత్వం వారి స్థానాల్లో తాత్కాలికంగా పలువురు సీనియర్ ప్రొఫెసర్లను ఇన్‌చార్జి వీసీలుగా నియమించింది. ఈక్రమంలో ఏఎన్‌యూలో సీనియర్ ప్రొఫెసర్ గంగాధరరావు ఇన్‌చార్జి వీసీగా నియమితులయ్యారు. ప్రొఫెసర్ గంగాధరరావు 1990 నవంబర్ 9న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అధ్యాపక వృత్తిని చేపట్టారు. ఇప్పటికే ఆయన వద్ద నుంచి 10 మంది పరిశోధన డిగ్రీలను పొందగా, మరో 12 మంది పీహెచ్‌డీలు చేస్తున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ప్రొఫెసర్‌గా విభిన్న పదోన్నతులు పొందిన ఆయన విభాగాధిపతిగాను, బీవోఎస్ ఛైర్మన్, డీన్ గాను విధులు నిర్వహించారు. అలాగే విశ్వవి ద్యాలయంలోని కంప్యూటర్ సెంటర్ విభాగానికి డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తూనే బోధన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

గోవా మద్యం పట్టివేత


ఈపూరు, జూన్ 18 : ఈపూరు సెబ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మర్రిపాలెం వద్ద గురువారం గోవా మద్యం బాటిళ్ళను తీసుకువెళ్తున్న నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న 400 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ అబ్దుల్ జలీల్ తెలిపారు. స్థానిక సెబ్ కార్యాలయంలో సీఐ మాట్లాడుతూ మర్రిబాలెం వద్ద గోవా మద్యం తీసుకువచ్చి పంపకాలు జరుగుతున్నాయనే సమాచారం రావడంతో ఎస్ఐ రేవతి సిబ్బందితో వెళ్ళి దాడులు చేసి పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్ళ విలువ రూ1.60 లక్షలు ఉంటుందన్నారు.

పశ్చిమడెల్టాకు 2010 క్యూసెక్కులు

దుగ్గిరాల, జూలై 18: ప్రకాశంబ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకాల్వకు 2010 క్యూసెక్కుల సాగునీటిని గురువారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.6 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 316 క్యూసెక్కులు, నిజాంపట్నంకాల్వకు 75, కొమ్మమూరుకాల్వకు 1611 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.


ప్రభుత్వ లాంఛనాలతో లూదియరావు అంత్యక్రియలు

- పాల్గొన్న టీడీపీ నేతలు, అధికారులు



లూదియరావు అంత్యక్రియల్లో పోలీసులు ఫైరింగ్

పిట్టలవానిపాలెం, జూలై 18: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ మార్షల్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతి చెందిన కూచిపూడి లూదియరావు అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో గురువారం నిర్వహించారు. మండలంలోని అల్లూరు గ్రామ పంచాయతీలోని నత్తలవారిపాలెం గ్రామంలోని మృతుని స్వగృహానికి బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ విచ్చేసి లూదియరావు భౌతికకాయానికి నివాళులు అర్పించారు. అంతిమయాత్రలో పాల్గొన్న వేగేశన నరేంద్రవర్మ లూదియరావు శవపేటికనుమోసారు. బాపట్ల డీఎస్పీ టీ.మురళీ కృష్ణ, బాపట్ల రూరల్ సీఐ హజరత్‌బాబు, టీడీపీ నేతలు, ప్రభుత్వ అధికారులు, బంధువులు, కుటుంబీకులు అంతిమయాత్రలో పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో లూదియరావు (ఫైల్)

35,887 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 38,465 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 35,887 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా యార్డు ఆవరణలో 19,453 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	17000	334	9000	15500
నెంబరు. 5	9000	13500	నెంబరు. 5	11500	11500
273	12500	14000	273	9000	10500
341	8000	15500	341	8500	16500
4884	--	–	4884	10500	13000
సూపర్ 10	12000	12000	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18300	తేజ	9000	18000
బ్యాడిగి	8000	14500	బ్యాడిగి	10000	14000
దేవనూరు డీలక్స్	8500	16500	దేవనూరు డీలక్స్	9000	14000
తెల్లకాయలు	4000	12000	తెల్లకాయలు	5000	11000

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124,135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



ఇటీవల భుజం ఆపరేషన్ చేయించుకున్న సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను గురువారం సాయంత్రం గుంటూరులోని ఆయన గృహంలో ఉండి ఎమ్మెల్యే రఘు రామకృష్ణంరాజు పరామర్శిం చారు. ఆయన యోగ క్షేమలను అడిగి తెలుసుకున్నారు. - సత్తెనపల్లి

ఇళ్ల పట్టాల ముసుగులో భూ దోపిడీ

● ఇష్టారాజ్యంగా ఆక్రమణలకు పాల్పడిన వైసీపీ నేతలు
● మాచర్ల శాసనసభ్యుడు బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, జూలై 18: పేదలకు ఇళ్ల పట్టాల ముసుగులో వైసీపీ నేతలు కోట్ల రూపాయాల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని, వారి వద్ద నుంచి ప్రతి రూపాయి వసూలు చేసి ప్రజా ఖజానాకు జమ చేస్తామని మాచర్ల శాసనస భ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన వెల్దుర్తి క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తక్కువ ధరకు రైతుల వద్ద నుంచి భూములు కొనుగోలు చేసి ప్రభుత్వానికి ఎక్కువ ధరలకు అమ్మిన విషయాన్ని శ్వేతపత్రం ద్వారా ఆధారాలతో సహా సీఎం చంద్రబాబునాయుడు వెల్లడించారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో 1.75 లక్షల ఎకరాల భూ ఆక్రమణలు జరిగాయని, వీటి విలువ రూ. 35,576 కోట్ల పైనే ఉంటుందన్నారు. ఇళ్ల పట్టాల పేరుతో 10 వేల ఎకరాలు, ఇసుక దందాలో రూ. 9,750 కోట్లు దోచుకున్నారని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన అత్యంత ప్రమాదకరమైన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ జీవో 512ను రద్దు చేశామన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ఆఫీసర్‌గా ప్రైవేటు వ్యక్తిని నియమించి పేద వర్గాల భూములను దోచుకునేందుకు వైసీపీ పన్నాగం పన్నిందన్నారు. ప్రభుత్వ, ప్రజల భూములనే కాదు భూగర్భ వనరులను వైసీపీ నేతలు మింగేశారని ఆరోపించారు. వాటి లెక్కలను తేల్చి, తిన్నదంతా కక్కిస్తామని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి హెచ్చరించారు.

మంత్రి ఫరూక్‌ను కలిసిన మైనార్టీ నేతలు

పిడుగురాళ్ల, జూలై 18: టీడీపీ జాతీయ కార్యాలయంలో రాష్ట్ర మైనార్టీ, న్యాయశాఖా మంత్రి జనాబ్ ఎండీ ఫరూక్‌ను గురువారం టీడీపీ గురజాల మైనార్టీ సెల్ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. వైసీపీపాలనలో పల్నాడు జిల్లాలో టీడీపీ మైనార్టీ నేతలపై దాడులు జరిపి, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించారని మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు అమీర్‌అలి మంత్రి ఫరూక్‌కు వివరించారు. కార్యక్రమంలో షేక్ తుల్లా, షేక్ అబ్దుల్లా, ముజీబ్, టీడీపీ మస్తాన్‌వలి, తాజుద్దీన్, షేక్ మున్నా, తదితరులు పాల్గొన్నారు.

23న సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

క్రోసూరు, జూలై 18 : క్రోసూరులోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో ఈనెల 23న రాష్ట్ర స్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ క్రీడాకారుల ఎంపికను నిర్వహిస్తున్నట్లు అమెచ్యూర్ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జీ కిషోర్‌రెడ్డి, కార్యదర్శి పీ.శివ పార్వతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 10, 11 తేదీల్లో వినుకొండలో జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ కోసం ఈ ఎంపికలను నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. ఎంపిక కోసం వచ్చే క్రీడాకారులు ఆధార్ కార్డు, రిజిస్ట్రేషన్ ఫారంను వెంట తెచ్చుకో వాలన్నారు. వివరాలకు 9908433422, 9490187858 నెంబర్లలో సంప్ర దించా లన్నారు. ఎంపికైనవారికి సెయింట్ ఆన్స్ పాఠశాలలో ఆగస్టు 1 నుంచి శిక్షణా శిబిరం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సిస్టర్ మేరీ రజిత తెలిపారు.



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న జనసేన నేతలు

జనసేన పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభం

మాచర్ల రూరల్, జూలై 18: జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి పులి హరి, నియోజకవర్గ అధికార ప్రతి నిధి నక్షత్రపు ప్రసాద్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ సభ్యత్వ నమోదు స్వీకరించిన వ్యక్తికి ప్రమాదం జరిగి గాయాలపాలైతే క్షతగాత్రుడికి రూ.50 వేలు, ప్రమాదవశాత్తూ మరణిస్తే మృతుడి కుటుంబా నికి రూ.5 లక్షలు పార్టీ తరపున అందుతాయన్నారు. కార్యక్రమంలో షేక్ మదీ న్, లాల్ కృష్ణ, మూరబోయిన శ్రీహరి, గుండెబోయిన తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు కొత్త మెనూ

● సత్తెనపల్లి డీవైఈవో వీ.ఏసుబాబు

రెంటచింతల,జూలై 18 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కొత్త మెనూ అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని సత్తెనపల్లి డీవైఈవో వీ.ఏసుబాబు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇక నుంచి మధ్యాహ్న భోజన పథకాన్ని పీఎం పోషణ్ మధ్యాహ్న భోజన పథకంగా వ్యవహరించాలన్నారు. ఈ మెనూ 2024-25 ప్రకారం ఈ విధంగా ఉందన్నారు. సోమవారం-హాట్ పొంగలి, ఉడికించిన గుడ్లు లేదా కూరగాయాల పలావు, గుడ్ల కూర, వేరుశనగ చిక్కి, మంగళవా రం-పులిహోర, టమోటా పచ్చడి లేదా దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్లు, బుధవారం -కూరగాయల అన్నం, బంగాళదుంప కుర్మ, ఉడికించిన గుడ్డు, వే రుశనగ చిక్కి, గురువారం- సాంబార్ బాత్, ఉడికించిన గుడ్లు, శుక్రవారం అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కి, శనివారం- తీపి పొంగళి, ఆకుకూర అన్నం, పప్పు చారు భోజనం ఇస్తారని డీవైఈవో ఏసు బాబు తెలిపారు. పాఠశాలల్లో ఈ మెనూనే అమలులో ఉంటుందన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

పిడుగురాళ్ల, జూలై 18: మండలంలోని జానపాడు గ్రామానికి చెందిన తెలుగు సాయికృష్ణ అనే వ్యక్తి జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం పొందియుండటంతో ఇటీవల ప్రమాదానికి గురైన సాయికృష్ణకు జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ పంపిన 14,500 రూపాయల చెక్కును గురువారం పార్టీ నాయకులు కటకం అంకారావు అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా జాయింట్ సెక్రటరీ దూదేకుల ఖాశింసైదా, మండల పార్టీ అధ్యక్షులు కామిశెట్టి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

21న కన్నా ప్రతిభా స్కాలర్‌షిప్‌ల పంపిణీ

సత్తెనపల్లి, జూలై 18 : కన్నా రంగయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 21సాయంత్రం 4 గంటలకు సత్తెనపల్లిలోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో విద్యార్థులకు ప్రతిభా స్కాలర్ షిప్‌లు అందించనున్నట్టు కన్నా కార్యాలయ వర్గం గురు వారం ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. స్కాలర్‌షిప్‌ల పంపిణీకి రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలి పారు. ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్‌ల పంపిణీ జరుగుతుందన్నారు.

ఈ-ఔషద్ ఆన్‌లైన్ అప్‌లోడ్‌ను పూర్తి చేయాలి

● కలెక్టర్ పీ.అరుణ్‌బాబు
● ముప్పాళ్ళ పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ
● పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలన



ముప్పాళ్ళ వైద్యశాలలోని వార్డును తనిఖీ చేస్తున్న కలెక్టర్ పీ.అరుణ్ బాబు

ముప్పాళ్ళ, జూలై 18: ఈ ఔషద్ ఆన్‌లైన్ అప్‌లోడ్ కార్యక్రమాన్ని వేగంగా పూర్తిచేసి నివేదికలను అందించాలని కలెక్టర్ పీ.అరుణ్ బాబు అన్నారు. గురువారం ముప్పాళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి డాక్టర్‌కు, వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. రిజిస్టర్లను పరిశీలించి ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. వైద్య సేవలు పొందుతున్న వారిని పరిశీలించి వారికి వైద్య సిబ్బంది అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.

అనంతరం ముప్పాళ్ళ హైస్కూల్‌కు వెళ్ళి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులతో ముచ్చటిం చారు. ప్రకటించిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనం బాగానే ఉంటుం దని విద్యార్థులు చెప్పటంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులను అభినం దించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలిం చి రికార్డులను పరిశీలించారు. సర్వీస్ సర్టిఫికెట్లను ఎప్పటికప్పుడు అందించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సింగారావు, డాక్టర్ జయకృష్ణ తదితరులు ఉన్నారు.



ముప్పాళ్ళ హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

సరైన పత్రాలు లేకుంటే అమ్మకాలు నిలిపివేత

● విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనివాసులరెడ్డి
● ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో తనిఖీలు



చల్లగుండ్లలో ఫెస్టిసైడ్ ప్రిన్సిపల్ సర్టిఫికెట్ లేని ఫెస్టిసైడ్ బాటిల్‌ను పరిశీలిస్తున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

నకరికల్లు, జూలై 18 : ఎరువులు కొనుగోలు చేసింది ఎక్కడ? అన్న దానికి సంబంధించిన పత్రాలు ఫారం-ఓ లేకుంటే వాటి అమ్మ కాలను నిలిపి వేయాలని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎస్ శ్రీనివాసులరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అలాగే ప్రిన్సిపల్ సర్టిఫికెట్ లేకుండా ఉన్నా పురుగు మందులను విక్రయించడం నిషిద్ధమని ఆయన తెలిపారు. గురువారం నకరికల్లు మండలంలోని నర్సింగ పాడులో ఉన్న శ్రీకాశీ విశ్వేశ్వర ఫెర్టిలైజర్ షాపులో ఓ ఫారం లైసెన్స్‌లో జత చేసుకోని కారణంగా 440 బస్తాల యూరియా అమ్మకాలను నిలిపి వేయాలని ఆదేశించారు. వీటి విలువ రూ.1,17,260 ఉంటుందని తెలిపారు. చల్లగుండ్లలోని శ్రీనివాస ట్రేడర్స్‌లో ప్రిన్సిపల్ సర్టిఫికెట్ లేకుండా ఉన్న పురుగు మందులను 31.5 లీటర్లను అమ్మ టానికి వీల్లేదని నిలుపుదల చేయించారు. వీటివిలువ రూ.84,386 ఉంటుందని శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ రెండు ఫెర్టిలైజర్స్ దుకాణాల్లో రూ.1,91,646 విలువైన ఎరువులు, పురుగు మందుల అమ్మ కాలను నిలుపుదల చేసినట్టు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ అధికారులు కే.రమణ కుమార్, కే.దేవదాసు, వ్యవసాయశాఖ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

రాయితీపై బియ్యం, కంది పప్పు

సత్తెనపల్లి, జూలై 18: రాయితీపై అందజేసే బియ్యం, కంది పప్పు ను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో మురళీకృష్ణ తెలిపారు. పట్టణంలోని గూండా కోటి రత్తయ్య రైసుమిల్లులో గురు వారం రాయితీపై బియ్యం, కందిపప్పు కేంద్రాన్ని ఆయన ప్రారంభిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని వ్యాపారులు నాణ్యమైన సరుకులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రమించాలన్నారు. నాణ్యమైన కంది పప్పు కేజీ రూ.160కు, బియ్యం కేజీ రూ.49కే అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పూర్ణచంద్రర రావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అమరావతి : రాష్ట్ర ఆహర, పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో కిరాణా మర్చంట్ సహకారంతో మండల కేంద్రమైన అమరావతిలో రిటైల్ దుకాణాల వద్ద కందిపప్పు, బియ్యంను తక్కువ ధరకు విక్రయించే కేంద్రాన్ని గురువారం తహసీల్దార్ వెంకటరమణారావు ప్రారంభించారు. ఈ కౌంటర్లలో కందిపప్పు కేజీ రూ.160, స్టీమ్డ్ బియ్యం కేజీ రూ.49, సాదారణ బియ్యం కేజీ రూ.48 అందజేస్తారని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజశేఖర్, కిరాణా మర్చంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కారంపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న పాత్రికేయులు

విజయసాయిరెడ్డి వ్యాఖ్యలపై

పాత్రికేయుల నిరసన, ఫిర్యాదు

కారంపూడి, జూలై 18: మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి పత్రికలను, పత్రికల అధిపతులను, విలేకరులను దూషించినం దుకు నిరసనగా పాత్రికేయులు గురువారం కారంపూడిలో నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి అనంతరం మండల రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. అలాగే పోలీస్ స్టేషన్‌లో విజయసాయిరెడ్డిపై ఫిర్యాదు చేశారు. ప్రజలకు, ప్రభుత్వా నికి వారధిగా వ్యవహరించే మీడియాపై, విలేకరులపై విజయసా యిరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. విజయసాయిరె డ్డిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

దుర్గి: మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై స్పందిస్తూ మండలంలోని పాత్రికేయులు గురు వారం పట్టణంలో నిరసనర్యాలీ నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ఫణేంద్రకుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్ర మంలో కేతావత్ చందురాథోడ్, కోటా యోహాన్, కర్పూరపు శ్రీను, శ్రీనివాసరావు, కేశవ, శ్యాం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో-1గా కాంతారావు

మాచర్ల రూరల్, జూలై 18: మాచర్ల మండలం ఎంఈవో 1గా కాంతారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నేతలు ఆయన్ను కలిసి సన్మానం నిర్వహించారు. ఈ కా ర్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్షుడు కేఎస్ రాజు, కేశవరెడ్డి, నాసర్‌రెడ్డి, ఆయేషా, సుల్తానా, గాలీబు, చోక్లానాయక్, ముస్తఫా, నజీర్, బాలాజీ, శంకర్‌నాయక్, మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ రంగారావుకు నివాళులు

సత్తెనపల్లి, జూలై 18 : ఘంటసాల కళా నిలయం ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ కళా క్షేత్రం వద్ద గురువారం సినీ నటుడు ఎస్వీ రంగారావు వర్ధంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు పూలమాలలు వేసి నివా ళులర్పించారు.కార్యక్రమంలో గురజాల సుబ్బారావు, డాక్టర్ జీ శ్రీధర్, తోట అంబిక, పెద్దింటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే తాగు నీరు అందిస్తాం

● ఎంపీడీవో గుప్త ● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

దుర్గి, జూలై 18: త్వరలోనే తాగు నీరు అందిస్తామని ఎంపీడీవో గుప్త అన్నారు. గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'కలుషిత తాగునీటితో ప్రజలకు ఇక్కట్లు' అనే కథనానికి ఎంపీడీవో గుప్త స్పందించారు. ఆయన మాట్లాడుతూ ధర్మవరం గ్రామంలో ఫిల్టర్ నుంచి వస్తున్న నీటిని వినియోగించవద్దని మండలంలోని ధర్మ వరం, దుర్గి, ఓబులేశునిపల్లె, కంచరగుంట, కోలగుట్ల, ముటుకూరు గ్రామాల్లో గురువారం దండోరా వేయించామన్నారు. ఆయా గ్రామా ల్లో నెలకొన్ని తాగునీటి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా మని, త్వరలోనే మంచినీటి నీటిని అందిస్తామని తెలిపారు.

ఘర్షణ ఘటనలో 17 మంది పై కేసు

● గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు

సత్తెనపల్లి రూరల్, జూలై 17: మండలంలోని ధూళ్ళిపాళ్ళలో బుధ వారం రాత్రి టీడీపీ కార్యకర్తలపై వైసీపీ మూకలు దాడి చేసిన ఘటనలో ఇరు వర్గాలకు చెందిన 17 మందిపై రూరల్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. టీడీపీకి చెందిన గొలమాల ఏడు కొండలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొలమాల ఆనందరావు, శ్యామ్‌సన్, జ్యోతిలతో పాటు మరో ఎనిమిది మందిపై, వైసీపీకి చెందిన గొలమాల జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొలమాల ఏడుకొండలు, మరో ఐదుగురిపై కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ పోలీసులు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

మాచర్లలో విజిలెన్స్ బృందాల తనిఖీ

● 98 మందికి రూ. 5.02 లక్షల అపరాధ రుసుం

గుంటూరు, జూలై 18: విద్యుత్ విజిలెన్స్ ఆపరేషన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఈఈ (డీపీఈ) కే. సూర్యప్రకాష్, మాచర్ల ఆపరేషన్‌ఈఈ జే.హరిబాబు ఆధ్వర్యంలో గురువారం మాచర్ల పట్టణంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 53 మంది అధికారులు, 159 మంది సిబ్బంది, 53 బృందాలుగా ఏర్పడి విస్తృ తంగా తనిఖీలు నిర్వహించినట్లు డీపీఈ ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. 5692 సర్వీసులు తనిఖీ చేసి అనుమతి లేకుండా నేరుగా విద్యుత్ చౌరానికి పాల్పడుతున్న 98 మందికి రూ.5.02 లక్షలు అప రాధ రుసుం విధించినట్లు పేర్కొన్నారు. విద్యుత్ చౌర్యం నేరమని, చౌర్యానికిపాల్పడే వారిపై 9440812263, 9440812360కు ఫిర్యాదులు చేయాలని ప్రజలకు సూచించారు.

ఫుట్ బాల్ జట్ల ఎంపిక

సత్తెనపల్లి, జూలై 18 : పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని సుగాలీ కాలనీ హైస్కూల్లో సబ్ జూనియర్ బాలబాలికల ఫుట్‌బాల్ జట్ల ఎంపికలు జరిగాయి. ఎంపికైన బాలికజట్టు ఈనెల 23న తిరుపతిలోని పద్మాలయ మహిళా యూనివర్సిటీలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటుందని పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కే. సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. జట్ల ఎంపిక కార్యక్రమంలో విజయ కుమార్, ఎస్కే రియాజ్, నాగిరెడ్డి, శ్రీరామిరెడ్డి, అచ్చిరెడ్డి, ఎస్ఎం సుభానీ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై హర్షం

రెంటచింతల,జూలై 18: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తూ రాష్ట్ర మంత్రి మండలి తీసుకున్న నిర్ణయం ముదావహమని పల్నాడు జిల్లా టీడీపీ రైతు విభాగం కార్యదర్శి చేరెడ్డి కృష్ణారెడ్డి, టీడీపీ మండల రైతు విభాగం అధ్యక్షుడు తుమ్మా జోజిరెడ్డిలు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ ఆస్తుల రక్షణ విషయమై ప్రజల ఆందోళనకు కూటమి ప్రభుత్వ నిర్ణయంతో తెరపడిం దన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో శాశ్వతంగా ఉచిత ఇసుక పాలసీని అమలు చేసేలా నిర్ణయం తీసుకోవడంతో రాష్ట్రంలో 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు రెండు పూటలా అన్నం తినేలా అవకాశం కల్పించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

ముమ్మరంగా పారిశుధ్య చర్యలు

మాచవరం, జూలై18: మండలంలోని పిల్లుట్ల గ్రామంలో గురు వారం ముమ్మర పారిశుధ్య చర్యలు చేపట్టారు. గ్రామానికి చెందిన సూరగాని కోటేశ్వరరావు అతిసారవ్యాధితో పిడుగురాళ్ల లెనిన్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్ర మాలను చేపట్టారు. గ్రామంలోని మురుగు కాల్వల్లో పూడికలను తొలగించారు. మినీ వాటర్ ట్యాంక్‌లను శుభ్రపరిచి బ్లీచింగ్, సున్నం చల్లించారు. వీధుల వెంట నీరు నిలబడకుండా చర్యలు చేపట్టారు. మంచినీటి పైపులైన్లు మురుగుకాల్వల్లో లేకుండా తొలగించారు. అలాగే గ్రామంలో ప్రజలకు పారిశుధ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అనంతరం మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న పలువురిని పరామర్శించి వైద్యాధికా రులతో సంప్రదింపులు జరిపారు. అన్ని గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలు, పంచాయతీలతో కలిసి ఎఎన్ఎంల ద్వారా చేయిం చాలని వైద్యాధికారికి సూచించారు. కార్యక్రమాలలో ఎంపీడీవో సురేష్, ఈవోపీఆర్డీ వెంగళరావు, సర్పంచ్ లఘుమవరపు శివపార్వతి సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శి దుర్గారావు, ప్రసాద్, ఇంజనీ రింగ్ అసిస్టెంట్ వెంకటేశ్వరరెడ్డి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



మోటారు వెహికల్ చట్టంపై అవగాహన ర్యాలీలో జడ్జి శ్రీరాంశ్రీనివాస్ తదితరులు

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

● మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి శ్రీరాం శ్రీనివాస్
● మోటార్ వెహికల్ చట్టంపై ప్రజలకు అవగాహన

మాచర్లటౌన్, జూలై 18: వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరిం చాలని మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి శ్రీరాం శ్రీనివాస్ కల్యాణ్ అన్నారు. గురువారం మండల న్యాయ సేవా కమిటి ఆధ్వర్యాన మోటార్ వెహికల్ చట్టంపై పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న న్యాయాధికారి శ్రీనివాస్ కల్యాణ్ మాట్లాడుతూ వాహనదా రులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారని, ఈ ప్రమాదాల నివారణకు ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ మోటారు వాహనాల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్ర మంలో మండల న్యాయ సేవా కమిటి సభ్యులు పలువురు పాల్గొన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

- సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి నాగ వెంకట శ్రీనివాసరావు

సత్తెనపల్లి : హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని సీనియర్ సివిల్ జడ్జి నాగ వెంకట శ్రీనివాసరావు అన్నారు. మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో గురువారం పట్టణ ప్రజలకు హెల్మెట్ వాడకం పై అవగాహన కల్పిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక తాలూకా సెంటర్ నుంచి మార్కెట్ యార్డు వరకు అవగాహన ర్యాలీ జరిగింది. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, పట్టణ ప్రముఖులు, న్యాయవాదులు హెల్మెట్ వాడకం పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు. ర్యాలీలో న్యాయా దికారులు మహమ్మద్ గౌస్, కౌశిత్ హుస్సేన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే అనీల్ కుమార్, పట్టణ ఎస్ఐ ఎం సంధ్యారాణి, పిడుగురాళ్ళ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం రాంబాబు పలువురు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో పిడుగురాళ్ల సీనియర్ సివిల్ జడ్జి మురళీగంగాధరరావు తదితరులు

ప్రమాదాలకు దూరంగా వుండండి

- పిడుగురాళ్ల జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మురళీగంగాధరరావు

పిడుగురాళ్ల: ప్రతి వాహనదారుడు ప్రమాదాలకు దూరంగా ఉండాల, అవగాహనతో వాహనాన్ని నడపాలని పిడుగురాళ్ల జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఎం.మురళీగంగాధరరావు తెలిపారు. బుధవారం పిడుగురాళ్ల కోర్టు ఆవరణ నుంచి పట్టణంలో న్యాయవాదులు, కోర్టుసిబ్బంది, కానిస్టేబుల్స్ వలంటీర్లు తదితరులతో రోడ్డుభద్రతా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమారస్వామి, కే.వెంకటేశ్వర్లు, దారా చెన్నయ్య, ఉడతా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గురజాలలో.. మండల లీగల్‌సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని గురజాల సివిల్ కోర్టు న్యాయాధికారి వై.శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం పట్టణంలోర్యాలీ నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందపాటి శ్రీనివాసరెడ్డి, కేవీ నాగార్జున, కొంగర హరిసత్యనారాయణ, కలివెల ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి ఇంటింటి సర్వే ప్రారంభం

క్రోసూరు, జూలై 18 : క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం నుంచి కుష్టు వ్యాధికి సంబంధించి ఇంటింటి సర్వే ప్రారంభించినట్టు వైద్యాధికారి డాక్టర్ ఇన్నారావు తెలియ జేశారు. ఏఎన్ఎంలు, ఆషావర్కర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి ఈ సర్వే చేపడతార న్నారు. కుటుంబంలోని ఆరోగ్య పరిస్థితులు, అనుమానితుల పేర్లను నమోదు చేసుకుంటారని, శరీరంపై ఏమైనా మచ్చలు కనపడితే శ్యాంపిల్స్ తీసుకుంటా రని తెలియజేశారు. సర్వేచేసిన ప్రతి ఇంటి గోడపై సర్వే వివరాలను నమోదు చేస్తారని తెలిపారు. సర్వే కార్యక్రమాన్ని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్ సన్, కమ్యూనిటీ హెల్త్ అధికారి సాంబశివుడు తదితరులు పర్యవేక్షించారు.

కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలి

నకరికల్లు, జూలై 18 : కౌలు రైతులకు రైతు హామీ సంతకం లేకుండానే రుణాలు మంజూరు చేయాలని కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి గాడిదమళ్ళ పిచ్చారావు కోరారు. గురువారం కుంకలగుంట చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ నాగరాజును కలసి కౌలు రైతు సంఘం నేతలు రైతు హామితో సంబంధం లేకుండా పంట రుణాలు మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. 2011 చట్టం ప్రకారం అలా ఇచ్చే అవ కాశం ఉందని కౌలు రైతులు మేనేజర్‌ను కోరారు. సానుకూలంగా స్పందించిన నాగరాజు రుణాలు మంజూరు చేసేందుకు అంగీకరించినట్టు రైతు సంఘం నేతలు తెలిపారు. కార్యక్రమంలో చీకటి రమేష్, కొత్తపల్లి దేవసాయం, ఉమ్మా లక్ష్మారెడ్డి, తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేద్దాం

నకరికల్లు, జూలై 18 : ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యతా యుతంగా వ్యవహరించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ప్రసాదు కోరారు. గురువారం నకరికల్లులో ఆ సంఘం ఆధ్వర్యంలో నూతన మండల కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా షేక్ ముజావర్ జాన్ అహమ్మద్, ఉపాధ్యక్షుడిగా బద్దుల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా బీవీ గిరి, కార్యదర్శిగా ఆర్ఎన్‌రెడ్డి, సభ్యులుగా కే.నాగేశ్వరరావు, కొప్పుల వెంకటేశ్వర్లు, వీ.రాజేశ్వరరావు, ఎన్ వెంకటరావులు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శీలం నాగార్జున పాల్గొన్నారు.

వేధింపులు ఆపకుంటే ఆందోళన చేపడతాం..

● అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి మల్లేశ్వరి

క్రోసూరు, జూలై 18 : ప్రభుత్వాలు మారినప్పుడల్లా అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, వీవోఏ తదితర వర్కర్లపై వేధింపులకు పాల్పడటం పరిపాటిగా మారిందని, వారిపై వేధింపులు మానుకోకపోతే ఆందోళనకు దిగాల్సి వస్తుందని పల్నాడుజిల్లా అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ కార్యదర్శి జీ.మల్లేశ్వరి హెచ్చరించారు. క్రోసూరులోని ఆమంచి విజ్ఞాన కేంద్రంలో అంగన్‌వాడీ వర్కర్స్‌హెల్పర్స్ యూనియన్ క్రోసూరు ప్రాజెక్టు జనరల్ బాడీ సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో ప్రజానీ కానికి వివిధ సేవలు అందజేస్తున్న అంగన్‌వాడీ, ఆషా, మధ్యాహ్న భోజనం వంటి వర్కర్లపై స్థానికులు వేధింపులు ఆపాలని కోరారు. నేతల ఒత్తిడిని తట్టుకోలేక కొంతమంది అంగన్‌వాడీ టీచర్లు అనారోగ్యాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ ఒత్తిడులు ఆపక పోతే ఉద్యమానికి సిద్ధ మవుతామన్నారు. సమావేశంలో గంజిమాల రవిబాబు, అంగన్‌వాడీ యూని యన్ నేతలతో పాటు పలు కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

హత్య, అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

క్రోసూరు, జూలై 18 : రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో దళిత, గిరిజన ఆడ పిల్లలపై హత్యలు, అత్యాచారాలకు కారకులైన నిందితులను కఠినంగా శిక్షిం చాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి దాసు డిమాండ్ చేశారు. గురువారం క్రోసూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవల చోటుచేసుకున్న బాలికలపై అత్యాచారం, హత్య ఘటనల్లో నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, హోంమంత్రి వెంటనే స్పందించి నిందితులకు కఠిన శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవటంతో పాటు బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఆయనతో పాటు జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యుడు బంకా శ్రీనివాసరావు ఉన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతున్న 13వ అదనపు జిల్లా న్యాయాధికారి సత్యశ్రీ

హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ

నరసరావుపేట లీగల్, జూలై 18: స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కోర్టు ఆవరణ నుంచి ర్యాలీ ప్రారంభమైంది. ర్యాలీని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 13వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎస్.సత్యశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెల్మెట్ ధారణ వల్ల అనుకోని పరిస్థితుల్లో రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు పూర్తిగా రక్షణ ఇస్తుందన్నారు. ఇటీవల ప్రభుత్వం హెల్మెట్ ధారణపై కఠినతరమైన నిబంధనలను ప్రవేశపెట్టిందన్నారు. హెల్మెట్ ధరించని వారిపై చట్టప్రకారం పోలీసులు, ట్రాన్స్‌పోర్టు అధికారులు తగుచర్యలు తీసుకుంటారన్నారు. మరో న్యాయాధికారి మధుస్వామి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించి హెల్మెట్ ధరించాలన్నారు. ఈ అంశంపై ప్రజలకు అవగాహన కల్పించటానికిగాను ఈ అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రావ్య మాట్లాడుతూ హెల్మెట్ ధరించని వారికి చట్ట ప్రకారం వెయ్యి రూపాయలు జరిమానా విధించటం జరుగుతుందన్నారు. ఈ అవగాహన ర్యాలీ ప్రధాన కూడళ్ళగుండా రైల్వేస్టేషన్ వరకు కొనసాగింది. ర్యాలీలో న్యాయాధికారులు సత్యశ్రీ, పూర్ణిమ, మధుస్వామి, ఆశీర్వాదం పాల్, ప్రవలిక, న్యాయవాద సంఘ అధ్యక్షుడు మేదరమెట్ల నాగేశ్వరరావు, న్యాయవాదులు అమూల్య, ప్రసాదు, హనుమంతరావు, బ్లెసీనా, శరత్, పారా లీగల్ వలంటీర్లు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును కలిసిన లింగంగుంట్ల అగ్రహారం భూముల రైతులు

లింగంగుంట్ల అగ్రహారం భూ సమస్యను

సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తా

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూలై 18: లింగంగుంట్ల అగ్రహారం సమస్య పరిష్కారానికి కట్టుబడి ఉన్నానని, ఈ భూసమస్యపై సీఎం దృష్టికి తీసుకు వెళ్తానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. గురువారం లింగంగుట్ల రైతులు ఎమ్మెల్యేని టీడీపీ కార్యాలయంలో కలిశారు. స్త్రీ ధనం, పసుపు కుంకుమ కింద ఇచ్చిన భూములు కూడా అవసరానికి పనికిరాకుండా పోయాయంటూ రైతుల ఆవేదన వ్యక్తంచేశారు. పిల్లలకు పెళ్ళిళ్లకు అమ్ముకుందామన్నా బ్యాంకులలో తాకట్టు పెడదామన్నా కుదరడం లేదన్నారు. గతంలో మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు సమస్య పరిష్కరానికి ముందుకు వచ్చినా నాడు ఉన్న పరిస్థితులలో సాధ్యం కాలేదని, ఇప్పుడు పరిష్కరించేందుకు శాయశక్తులా కృషిచేయాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ లింగంగుట్ల ఆగ్రహారం రైతులు దశాబ్దాలుగా పడుతున్న భూసమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా అడుగులు వేస్తానని హామీ ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాలలో కూడా చర్చించే ప్రయత్నం చేస్తానని, ముఖ్యమంత్రి ద్వారా సమస్యను పరిష్కరించేందుకు వెళ్ళి కలుస్తానని అన్నారు. జాయింట్ కలెక్టర్ నియామకం పూర్తయిన వెంటనే సమస్యను పరిష్కరించేందుకు వెళ్ళి కలుస్తానని చెప్పారు. కార్యక్రమంలో గంగుల పెద్దిరెడ్డి, మిర్యాల ఏడుకొండలు, మహానందరెడ్డి, ప్రభుదాస్, బాలమోహన్‌రెడ్డి, యన్నం రవీంద్రారెడ్డి, మిరియాల వెంకటసుబ్బమ్మ, గోవింద్, సూర్యనారాయణ చౌదరి, రైతులు కలిశారు.

మొదటి ఎంఈవోగా హనీలా నియామకం

రొంపిచర్ల, జూలై 18: రొంపిచర్ల మండలం మొదటి ఎంఈవోగా పీ హనీలా గురువారం నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె పదవీ బాధ్యతలు చేపట్టారు. వినుకొండ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. మండల 1వ ఎంఈవోగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా రెండో ఎంఈవో బ్రహ్మేశ్వరరావు, మండల వనరుల కేంద్రం భవనం సిబ్బందితో సమావేశం నిర్వహించారు.



మొదటి ఎంఈవో హనీలా

త్రికోటేశ్వరస్వామికి రూ.20.6 లక్షల ఆదాయం

కోటప్పకొండ (నరసరావుపేట రూరల్), జూలై 18: ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయానికి తొలిఏకాదశి సందర్భంగా రూ.20,96,556 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆలయంలోని టికెట్ల విక్రయంద్వారా రూ.6,51,998, ప్రధానహుండీ రూ.10,47,073, ప్రసాద విక్రయాలతో రూ.3,56,595, అన్నదాన హుండీ విరాళం ద్వారా రూ.40,890 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం స్వామి వారికి రూ.3,24,443 ఆదాయం అధికంగా వచ్చినట్లు తెలిపారు.



రివ్యూలో మాట్లాడుతున్న డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ రవి

మాతృ శిశు మరణాలపై సమీక్ష

నరసరావుపేట లీగల్, జూలై 18: పల్నాడు జిల్లా స్థాయిలో గత మూడు నెలల కాలంలో సంభవించిన మాతృ శిశు మరణాలపై గురువారం డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయంలో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం అండ్ హెచ్‌వో మాట్లాడుతూ ఈ మూడు నెలల్లో జిల్లాలోని అచ్చంపేట, క్రోసూరు, బొల్లాపల్లి, కొప్పునూరు ఆరోగ్య కేంద్రాల పరిధిలో నాలుగు మరణాలు సంభవించినట్లు తెలిపారు. సంబంధిత సిబ్బందితో సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. మాతృ మరణాలకు దారితీసిన కారణాలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో ఇటువంటి మాతృ మరణాలు సంభవించకుండా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. క్రోసూరు, కోటప్పకొండ, ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో సంభవించిన మూడు శిశు మరణాలపై సమగ్రమైన విచారణ నిర్వహించి భవిష్యత్‌లో ఇటువంటి శిశు మరణాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సంబంధిత రికార్డులను తనిఖీచేశారు. కార్యక్రమంలో సంబంధిత కమిటీ గైనకాలజిస్టులు పాల్గొని వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీసీహెచ్‌ఎస్ బీవీ రంగారావు, మంత్రు నాయక్, వెంకటరావు, డాక్టర్ వసంతరాయ, డాక్టర్ హనుమ కుమార్, డాక్టర్ బుజ్జిబాబు, బీ గీతాంజలి, డాక్టర్ మురళీకృష్ణ, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించండి

● నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల, జూలై 18: నరసరావుపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ గెలుపొందటానికి కృషిచేసిన వారిని గుర్తించాలని నరసరావుపేట నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి గురువారం కోరారు. గత ఎన్నికల్లో అరాచక వైసీపీని ఎదిరించి విజయకేతనం ఎగురవేయటంలో కీలకంగా పనిచేసిన కార్యకర్తల కష్టాన్ని నేతలు గుర్తించాలన్నారు. భార్య, పిల్లలు, తల్లిదండ్రులు ఆర్థాకలితో పడుకున్నా, వైసీపీ దురాగతాలను ఎండగట్టిన వారిని గుర్తించాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే అరవింద బాబులను కోరుతున్నట్లు తెలిపారు.

శవ రాజకీయాలు చేస్తున్న జగన్

● వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



వినుకొండ టౌన్, జూలై 18: జనం ఛీకొట్టినా మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి సిగ్గులేకుండా తనుకు అలవాటైన శవ రాజకీయాలు పదేపదే చేస్తున్నారని వినుకొండ నియోజకవర్గ శాసనసభ్యుడు జీవీ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్మోహన్‌రెడ్డి అసలు ఏం ముఖం పెట్టుకొని వినుకొండకు వస్తున్నారంటూ ఆయన ధ్వజమెత్తారు. ఐదేళ్ళలో అతడు పెంచిపోషించిన రౌడీయిజం, వర్గపోరులే నేటి నెత్తుటి మరకలకు కారణమని, వైసీపీ ప్రభుత్వంలోనే తప్పుచేసిన వారిపై చర్యలు తీసుకుని ఉంటే నేడు వినుకొండలో ఈ పరిస్థితి ఇంతవరకు వచ్చేదా అని ప్రశ్నించారు. రషీద్ హత్య అనంతర పరిణామాలు వైసీసీ ప్రచారాలను ఆయన ఖండించారు. వైసీపీ ప్రభుత్వంలో తప్పులు చేసిన వారిపై చర్యలు తీసుకోలేదు. కాబట్టే జిలాని ఇంత దారుణానికి ఒడిగట్టాడని హత్యచేసిన జిలానీ జైలుకు వెళ్ళాడని, హత్యకు గురైన రషీద్ కుటుంబం నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తొలి ఏకాదశి పండుగ రోజు వినుకొండలో ఇంత దారుణమైన ఘటన జరగడం చాలా బాధాకరమన్నారు. చనిపోయిన వ్యక్తి చంపిన వ్యక్తి ఇద్దరూ వైసీపీలో తిరిగిన విషయం గుర్తించుకోవాలన్నారు. వారిద్దర మధ్య వ్యక్తిగత గొడవలు ఉన్నాయని, జిలానిపై హత్యయత్నం కేసు నమోదైన ఎఫ్ఐఆర్ కాపీని మీడియాకు అందజేశారు. పూర్తిగా వ్యక్తిగత కారణాలతో హత్య జరిగితే దానిని అడ్డుపెట్టుకొని శవ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. వ్యక్తిగత కక్షలను పార్టీలకు ఈ విధంగా అంటకట్టడం దుర్మార్గమన్నారు. ప్రజలు అమాయకులు కాదని గతంలో జగన్ బాబాయి వివేక హత్య కేసులోనే వారి నిజస్వరూపాన్ని చూశారన్నారు. అలాగే ఇప్పుడు వాళ్ళ పార్టీ కార్యకర్తలను ఆ పార్టీ కార్యకర్తలు హత్యచేసిన తెలుగుదేశం పార్టీపై బురద చల్లడం శవరాజకీయం చేయడం వారికే చెల్లిందన్నారు. ఏదైనా హత్య జరగడం బాధాకరమని దీనిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని, నిందితుడిని కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటుందన్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు కూడా ఈ కేసులో చాలా నిస్పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని స్పష్టం చేశారు. వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వినుకొండలో గంజాయి, రౌడీయిజాన్ని ప్రోత్సహించారని, తప్పులు చేసిన వారిని, దాడులకు పాల్పడిన వారిపై కేసులు పెట్టకుండా కాపాడారని జీవీ ఆరోపించారు. బ్రహ్మనాయుడు నిర్వాహకాల వల్లనే రౌడీలు తీవ్ర నేరాలకు ఒడిగట్టే దుస్సాహం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పుడు హత్యచేసిన జిలానీ జైలుకు వెళితే వారి కుటుంబం మొత్తం కష్టాల్లో పడిందని, హత్యకు గురైన రషీదు కుటుంబం తీవ్రంగా నష్టపోయిందన్నారు. ఈ రెండు నష్టాలకు బాధ్యత వహించాల్సింది బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. ఈ నష్టాలకు బ్రహనాయుడు ముఖ్యఅనుచరులే కారణమంటూ ధ్వజమెత్తారు. ఈ అనుభవాల నేపథ్యంలో రౌడీయిజాన్ని, గుండాయిజాన్ని ఉక్కుపాదంతో అణిచివేస్తామని హెచ్చరించారు. రషీదు హత్య చాలా బాధాకరమని, అతని కుటుంబానికి సానుభూతి తెలియజేస్తున్నామని చెప్పారు. ఇలాంటి దుర్ఘటనలు భవిష్యతలో జరగకూడదని కోరుకుంటున్నానని, అలా జరగకుండా పూర్తిస్థాయిలో చర్యలు చేపడతామని వెళ్లడించారు. వినుకొండలో ఎలాంటి గొడవలు జరగకుండా ఏం చర్యలు తీసుకోవాలో అన్నీ చేస్తానని స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండ చూడడమే కూటమి ప్రభుత్వం బాధ్యతని తెలిపారు.

మెరుగైన పారిశుధ్యం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టండి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



28వ వార్డులో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కమిషనర్ సి.రవిచంద్రరెడ్డి

నరసరావుపేట రూరల్, జూలై 18: జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆదేశించారు. గురువారం నరసరావుపేట పురపాలక సంఘం పరిధిలో మార్నింగ్ విజిట్‌లో భాగంగా 28వ వార్డు పాతురు శివాలయం బజార్ పరిసర ప్రాంతాలలో శానిటేషన్ డ్రెయిన్ల శుభ్రత కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మున్సిపల్ కమిషనర్ సి రవిచంద్రరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డులోని కొన్ని ఇళ్లవారు తమ ఇంటి నీటి కుళాయి కనెక్షన్ కాలువ మీద నుంచి మరికొన్ని కాలువలలో నుంచి రావడం గమనించి సదరు ఇంటి యజమానిని పిలిపించి నీటి కుళాయిల్ని స్వచ్ఛందంగా కాల్వకు దూరంలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. లేకుంటే పురపాలక ఇంజనీరింగ్ సిబ్బందికి కుళాయిలను ఏర్పాటు చేస్తారన్నారు. కాలువలోని నీరు తాగునీరు రెండు కలిసి డయేరియా, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందన్నారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా కాలువల్లో ఉన్న కుళాయి కనెక్షన్‌ను తీసివేసుకుని దూరంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ వార్డులో తిరుగుతూ కాలువల శుభ్రం, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సమస్యల పరిష్కరించటం, నీరు కలుషితం జరగకుండా చూడాలని శానిటేషన్ ఇంజనీరింగ్ విభాగ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి ఒక్క వార్డు సచివాలయం సెక్రటరీలు తమ సచివాలయం పరిధిలో ఉన్న మురుగు కాలువలు, తాగునీరు కలుషితం అవ్వకుండా శానిటేషన్ సెక్రటరీలతో సమన్వయంగా పనిచేసుకోవాలన్నారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



ఎస్పీ కంచి శ్రీనివాసరావుతో ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, రాష్ట్ర బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయకుమార్

నరసరావుపేట టౌన్, జూలై 18: పల్నాడు జిల్లా ఎస్పీగా నియమితులైన కంచి శ్రీనివాసరావును ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గురువారం ఎస్పీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో శాంతి భద్రతలు పరిరక్షించాలని కోరారు. గత ఐదేళ్ల పాలనలో పల్నాడు అంటే అరాచకాలు మాత్రమే గుర్తుకు వచ్చేలా చేశారని అన్నారు. జిల్లాలో గంజాయి మాఫియాపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని, ఆ విషయంలో ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. ప్రజా సమస్యల విషయంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని తెలిపారు. ఆ మేరకు పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని కోరారు. ఆయన వెంట బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్, గాడిపర్తి సురేష్, షేక్ మహమ్మద్ రఫీ, ఖాసీమ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ వైద్యశాలలో రషీదు మృతదేహాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

రషీదు మృతదేహానికి వైసీపీ నాయకుల నివాళి

వినుకొండ టౌన్, జూలై 18: పట్టణంలో బుధవారం హత్యకు గురైన రషీదు మృతదేహాన్ని వైసీపీ నాయకులు సందర్శించి, నివాళులర్పించారు. ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న రషీదు మృతదేహాన్ని గురువారం మాజీ ఎమ్మెల్యేలు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, లేళ్ళ అప్పిరెడ్డిలు సందర్శించి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లడుతూ టీడీపీ వచ్చిన తర్వాత రాష్ట్రంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు పెరిగాయన్నారు. ప్రజలు వీరికి అధికారం ఇచ్చింది ప్రతిపక్షాలపై దాడులు చేయడానికా అని ప్రశ్నించారు. ఎంతో ప్రశాంతగా ఉన్న వినుకొండలో రషీదును కిరాతకంగా హత్యచేయడం దారుణమని, దీనిని మరలా వైసీపీకి అంటించాలని చూస్తున్నారన్నారు. హత్యకు గురైన రషీదు, హత్య చేసిన జిలానీలు వైసీపీకి చెందిన వారంటూ టీడీపీ సోషల్ మీడియాలో పెడుతున్నారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు.

కష్టపడితేనే సత్ఫలితాలు: నడికట్టు రామిరెడ్డి

నాదెండ్ల, జూలై 18: ఏ రంగమైనా లక్ష్యంతో కష్టపడితేనే సత్ఫలితాలు సాధించగలమని గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి అన్నారు. మండలంలోని చిరుమామిళ్ళ గ్రామంలో నడికట్టు రామిరెడ్డి ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉన్నత పాఠశాలతో పాటు మోడల్ పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసి ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన జల్దీ చెర్రి, జాన్ జోయల్, గాయత్రి సంజీవిని, ముబీనీలను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుందరరావు, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో కే-రిడ్జి విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట టౌన్, జూలై 18: వ్యాసరచన పోటీలలో కే-రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ బర్నబాస్ గురువారం తెలిపారు. టాటా బిల్డింగ్ ఇండియా స్కూల్ స్మార్ట్ ఇండియా నిర్మాణంలో యువతపాత్ర, నూతన ఆవిష్కరణలు వంటి అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో కే-రిడ్జి స్కూల్ విద్యార్థులు దర్షిత్ మొదటి, సునుమ తస్లీమ్ రెండవ, కోమటి సమంత, మోక్షిత్‌లు మూడవ బహుమతి లభించింది. విద్యార్థులను స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, హేమంత్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

పార్టీ అభ్యున్నతికే సభ్యత్వ నమోదు

● జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ

నరసరావుపేట టౌన్, జూలై 18: జనసేన పార్టీ అభ్యున్నతికే నాలుగో విడత సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామని జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ పేర్కొన్నారు. గురువారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట జనసేన పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సయ్యద్ జిలానీ మాట్లాడుతూ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు అత్యధికంగా సభ్యత్వ నమోదు చేయించడమే లక్ష్యం అన్నారు. ఇప్పటివరకు 6.47లక్షల సభ్యత్వం ఉందని, దానిని 10లక్షలకు చేర్చాలని పార్టీ అధ్యక్షుడు ఆదేశం అన్నారు. దీని కోసం ప్రతిఒక్క కార్యకర్త కృషిచేయాలన్నారు.



సాధువులను సన్మానిస్తున్న హిమాలయ గురువు

సాధువులకు ఘన సన్మానం

వినుకొండటౌన్, జూలై 18: మండలంలోని విఠంరాజుపల్లి గ్రామ సమీపంలోని శాంతి ఆశ్రమ ట్రస్ట్ ఆవరణలో అఖండ జ్యోతి ప్రదాత శ్రీహిమాలయ గురువు ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లోని 108మంది సాధుసంతుల ఆత్మీయ సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో హిమాలయ గురువు మాట్లాడుతూ అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం సర్వలోక కళ్యాణార్థం నిర్వహించామన్నారు. కార్యక్రమానికి వచ్చిన సాధుసంతులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కే.కోటేశ్వరరావు, పెండేల పల్లారావు, సురేష్, కాశి, గజవల్లి పవన్, భాగవత్ రవికుమార్ ఉన్నారు.

టీడీపీ నాయకులపై వైసీపీ వర్గీయుల దాడి

నూజెండ్ల, జూలై 18: టీడీపీ నాయకులపై వైసీపీ వర్గీయులు దాడి చేసిన సంఘటన మండలంలోని బుర్రిపాలెంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన టీడీపీ నేత గౌరుబోయిన శివయ్యను అదే గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన బొడ్డు శ్రీను, అతని భార్య ఈశ్వరమ్మలు పాత కక్షల నేపథ్యంలో దాడి చేయటంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడు వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు

వినుకొండ టౌన్, జులై 18: గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య యత్నానికి పాల్పడిన సంఘటన వినుకొండ రైల్వేస్టేషన్ ఆవరణలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే తెలుగుభాష రాని గుర్తు తెలియని యువకుడు గొంతుకోసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు యువకుడిని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు వినుకొండ హెడ్‌కానిస్టేబుల్ బాజి తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

కేజీబీవీలో జీసీడీవో విచారణ

ఈపూరు, జూలై 18: ఈపూరు కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో సిబ్బంది దాడిచేసుకున్న ఫిర్యాదుపై జీసీడీవో రేవతి గురువారం విచారణ జరిపారు. స్కూల్‌లో పీఈటీ ఝాన్సీ, వాచ్‌ఉమెన్ మరియమ్మలులు ఒకరిపై ఒకరు దాడిచేసుకున్న సంఘటనను ప్రినిపాల్ జ్యోతి జిల్లా విద్యాశాఖాధికారికి పిర్యాదు చేశారు. దీనిపై జీసీడీవో విచారణ జరిపారు. సిబ్బందిని, విద్యార్థునులను విచారించారు. అనంతరం జీసీడీవో మాట్లాడుతూ హైస్కూల్ విద్యార్థినులు కేజీబీవీ పాఠశాల ముందు బస్సుకోసం ఉండగా వర్షం రావడంతో ఆ పిల్లలను పీఈటీ ఝాన్సీ లోపలకు తీసుకువచ్చారన్నారు. ఆ సమయంలో అక్కడే ఉన్న వాచ్‌ఉమెన్ మరియమ్మ వారిని అడ్డుకోవటంతో వారి మధ్య ఘర్షణ జరిగినట్లు వివరించారు. దీనిపై నివేదికను డీఈఓకు పంపుతామన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం: జీసీడీవో రేవతి

ఈపూరు, జూలై 18: కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయాలలో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాబోధన చేస్తున్నట్లు పల్నాడు జిల్లా జీసీడీవో రేవతి అన్నారు. గురువారం ఈపూరు కేజీబీవీ పాఠశాలను ఆమె సందర్శించారు. వంటశాలను తనిఖీచేసి అన్నం, కూరలు పరిశీలించారు. అనంతరం 9వ తరగతి విద్యార్థినులను ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. అన్ని తరగతుల విద్యార్థినులతో ముచ్చటించారు. 6వ తరగతి పిల్లలకోసం 15రోజులు రెడినస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

వ్యక్తిగత కక్షతోనే వినుకొండలో హత్య

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జూలై 18: వినుకొండ పట్టణంలో బుధవారం జరిగిన హత్య వ్యక్తిగత కక్షలతోనే జరిగిందని, రాజకీయ పార్టీలకు ఎటువంటి సంబంధం లేదని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శవ రాజకీయాలు వైసీపీకి పేటెంట్ హక్కు అని, సొంత బాబాయిని హత్యచేసి నరకాసుర రక్తచరిత్ర అని ప్రచారంచేసి, రాజకీయ లబ్ధిపొందిన వ్యకులను దయచేసి ఎవరూ నమ్మవలసిన అవసరం లేదన్నారు. రాజకీయ స్వార్థం కోసం వైసీపీ వారు ఎంతకైనా దిగజారుతారని ప్రజలందరూ కూడా సంయమనంగా ఉండాలని కోరారు. ఈ ఘటనకు కేవలం ఇద్దరు వ్యక్తుల మధ్య ఉన్నటువంటి వ్యక్తిగత కక్షలే కారణమని, దయచేసి పార్టీల రంగు పులమవద్దని హితవు పలికారు.



ర్యాలీలో జడ్జి నరేంద్రరెడ్డితో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

చిలకలూరిపేటలో హెల్మెట్ల వాడకంపై అవగాహన ర్యాలీ

చిలకలూరిపేట, జూలై 18: మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కే.నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో హెల్మెట్ల వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకై ర్యాలీ నిర్వహించారు. కోర్టు వద్ద నుంచి ప్రారంభించి ప్రధాన సెంటర్ల గుండా ఈ ర్యాలీ కొనసాగింది. హెల్మెట్లను ధరించి ప్రయాణం చేయాలని, దీనివలన వారికి, కుటుంబ సభ్యులకు రక్షణ లభిస్తుందని జడ్జి నరేంద్రరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో స్థానిక మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్, పోలీసు అధికారులు, న్యాయవాదులు, లా స్టూడెంట్స్ పాల్గొన్నారు.

చెరువులో పడి యువకుడి మృతి



దుర్మరణం చెందిన హనుమా నాయక్

చిలకలూరిపేట, జూలై 18: పట్టణంలోని సుగాలీ కాలనీకి చెందిన రేఖావత్ హనుమానాయక్ (35) గురువారం చిలకలూరిపేట తాగునీటి చెరువులో పడి దుర్మరణం చెందాడు. ఈ యువకుడు తన స్నేహితులతో కలసి చేపలు పట్టేందుకు పట్టణానికి సమీపంలో ఉన్న తాగునీటి చెరువు వద్దకు వెళ్లి చెరువులో పడి మృతిచెందాడు. చిలకలూరిపేట రూరల్ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఐతే ఈ సంఘటనపై తమకు కొన్ని అనుమానాలు ఉన్నాయని, కేసు దర్యాప్తుచేసి నిజాలు నిగ్గుతేల్చాలని కుటుంబ సభ్యులు పోలీసులను కోరారు.



వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

విజయ సాయిరెడ్డి వ్యాఖ్యలపై జర్నలిస్టుల నిరసన

చిలకలూరిపేట, జూలై 18: రాజ్యసభ సభ్యులు విజయ సాయిరెడ్డి మీడియా వారిని అసభ్యంగా మాట్లాడటంపై పట్టణంలో వివిధ జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. జాతీయ రహదారిపై మానవహారంగా ఏర్పడి విజయసాయిరెడ్డి వ్యాఖ్యలను ఖండించారు. అనంతరం మండల కార్యాలయం వద్దకు చేరుకుని డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. జర్నలిస్టులకు మద్దతుగా టీడీపీ, సీపీఐ, సీపీఎం, లోక్‌సత్తా పార్టీల నాయకులు వచ్చి నిరసన కార్యక్రమంలో పాల్గొని మద్దతు తెలిపారు. కార్యక్రమాల్లో జర్నలిస్టు సంఘాల నేతలు భక్తవత్సలం, మస్తాన్‌వలి, గిరి, సత్తార్, గోపీ, ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై అవగాహన



లోక్ అదాలత్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న విశ్రాంత న్యాయమూర్తి విక్టర్ ఇమ్మానియేలు

చిలకలూరిపేట, జూలై 18: గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఆధారిత విద్యుత్ వినియోగదారుల విద్యుత్ వినియోగం పై అవగాహన కల్పిస్తూ ప్రధాన సమస్యల పరిష్కారానికి మెరుగైన సేవలను అందించాలని విశ్రాంత న్యాయమూర్తి ఏపీసీపీడీసీఎల్ చైర్మన్ ఎస్ ఇమ్మానియేలు గురువారం అన్నారు. చిలకలూరిపేటలో విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయంలో ఈఈ సీహెచ్ రమేష్ అధ్యక్షతన జరిగిన విద్యుత్ వినియోగ దారుల లోక్ అదాలత్, అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన వెంకట కృష్ణ, ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, సునీత, విజయ కుమార్, డీఈఈలు అశోక్ కుమార్, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

80మంది పేదలకు దుస్తుల పంపిణీ

చిలకలూరిపేట, జూలై 18: కార్మిక, కర్షక, ప్రజా సమస్యల కోసం అహర్నిశలు పాటుపడిన పట్టణానికి చెందిన సీపీఐ నాయకులు సీఆర్ మోహన్ వర్ధంతి సందర్భంగా స్థానిక 25వ వార్డులో జరిగిన కార్యక్రమంలో 80మంది నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. మోహన్ కుటుంబ సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చెరుకుపల్లి నిర్మల, దాసరి వరహాలు, సృజన్, నరసింహా భారతి, యలమంద, పోలయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల ర్యాలీ

చిలకలూరిపేట, జూలై 18: ఉద్యోగులకు రావాల్సిన అన్ని బకాయిలను తిరిగి ఇప్పించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గురువారం డిమాండ్ చేసింది. పట్టణంలో ఈ సంఘం నాయకులు ర్యాలీ నిర్వహించి మండల కార్యాలయం వద్ద ధర్నా జరిపారు. ముఖ్యంగా తమ సంఘం నాయకుడు కేఆర్ సూర్యనారాయణపై పెట్టిన కేసులను తక్షణం రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సంఘం యూనిట్ అధ్యక్షుడు స్వర్ణ చినరామిరెడ్డి, ఎస్.రాజేశ్వరి, వాసు, చలమారెడ్డి, కుంచాల శ్రీనివాస్, పీటర్, చుక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు నిలిపివేత

యడ్లపాడు, జూలై 18: యడ్లపాడు పరిధిలోని పదహారో నంబరు జాతీయ రహదారి సర్వీసు రోడ్ల ఆక్రమణల తొలగింపు అర్ధాంతరంగా నిలిచిపోయింది. ఇటీవల గ్రామస్థులు చేసిన ఫిర్యాదులపై హైవే సిబ్బంది గురువారం ఆక్రమణలు తొలగించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఎస్ఐ రాజీవ్ శ్యామ్యూల్‌కుమార్ హైవే సిబ్బందిని స్టేషన్‌కు పిలిపించి శాంతిభద్రతల సమస్య ఉత్పన్నం అవుతుందని, రెవెన్యూ, పంచాయతీ అధికారులతోపాటు పోలీసులకు ముందస్తు సమాచారం అందించి ఆక్రమణల తొలగింపు చేపట్టాలన్నారు. దీంతో హైవే సిబ్బంది ఆక్రమణల తొలగింపు యత్నాలను తాత్కాలికంగా విరమించి వెనుదిరిగారు.

20న స్కూల్ కబడ్డీ జట్ల ఎంపిక

చిలకలూరిపేట, జూలై 18: ఆంధ్రప్రదేశ్ స్కూల్ కబడ్డీ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో అండర్-14 బాల బాలికలు, అండర్-17 బాల బాలికలు రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ గురునాథ్, స్కూల్ డైరెక్టర్ మహమ్మద్ అస్లాం గురువారం పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి ఈనెల 27 నుంచి విశాఖపట్నం జిల్లా పాడేరులో జరిగే సౌత్ జోన్ జాతీయ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టుగా పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో కే శేషగిరి, ఎం.రాజా, పీ ప్రవీణ్ పాల్గొన్నారు. ఇతర వివరాలకు వంకా సుబ్బారావు, సెల్: 8008593468కు సంప్రదించాలని కోరారు.